ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 13 నవంబరు 2024 | 5



నేడు నరసింహస్వామి తెప్పోత్సవం

కోరుకొండ,నవంబరు12(ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా బుధవారం రాత్రి 7 గంటలకు చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య తెప్పోత్సవం నిర్వహించనున్నారు. దేవుడి కోనేటి వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు దేవస్థానం చైర్మన్ పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. తెప్పోత్సవంపై స్వామివారితో పాటు 15 మందికి మించి ఉండరాదని ఎస్ఐ,అధికారులు పేర్కొన్నారు.



దేదీప్యమానంగా..నరసన్న కొండ

కోరుకొండ,నవంబరు12(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా మెట్ల దీపోత్సవం నిర్వహించారు. కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కొండ మెట్లపై మహి ళలు పెద్ద ఎత్తున దీపాలు వెలగించారు. దీపాలు వెలిగించేందుకు మహిళలు పోటీపడ్డారు. దీంతో కొండంతా దేదీప్యమానంగా కనిపించింది. చీకటి మధ్య ఎర్రని కాంతులతో నిండిపోయింది. ముందుగా స్వామివారి పాదాల వద్ద అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేయించి దీపాలు వెలిగించి మెట్ల దీపోత్సవం ప్రారంభించారు.అనంతరం స్వామి వారి కొండచుట్టూ పాదాల చుట్టూ 650 మెట్లకు ఇరువైపులా కార్తీక దీపాలను వెలిగించారు. అచ్యుతాపురం గ్రామానికి చెందిన శంఖ రామకృష్ణ, సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులు స్వామివారిమెట్ల దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులందరికీ కార్తీక అన్నసమారాధన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక స్వాములు బీజేపీ, జనసేన,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


సాగునీటి సలహా మండలి సమావేశంలో ఇరిగేషన్ అధికారులపై మండిపడుతున్న కలెక్టర్

కూటమి.. రి..యాక్షన్!





సోషల్ మీడియా పోస్టులపై ఉక్కుపాదం

- నాడు ఇష్టానుసారం పోస్టులు
- నేడు 11 కేసులు నమోదు
- మాజీ ఎంపీ, పోసానిపైనా కేసు
- ముగ్గురి అరెస్టు..ఇద్దరికి రిమాండ్
- పలువురి కోసం దర్యాప్తు
- సోషల్ మీడియాపై నిఘా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో ఇష్టానుసారం పోస్టులు.. ఎవరికి తోచినట్టు వారు పెట్టడమే.. పార్టీపై అభిమానమో.. జగన్ పదవి ఇస్తారని వ్యామోహమో తెలియదు.. సోషల్ మీడియాను తమ ఇష్టానుసారం వాడేశారు.. రకరకాల కామెంట్లతో పిచ్చెక్కించారు.. ప్రస్తుతం కేసులతో అల్లాడుతున్నారు. చేసినతప్పుకు ఏనాటికైనా శిక్ష తప్పదనే నానుడి ఈ సంఘటనకు అతికినట్టు సరిపోతుంది. కూటమి పెద్దల సహనాన్ని పరీక్షిస్తున్న వైసీపీ నాయకులకు గట్టిగా బుద్ధి చెప్ప డానికి ప్రభుత్వం నిర్ణయించింది.దీంతో ఇప్పటి వరకూ మిన్నకున్న పోలీసులు రంగంలోకి దిగారు.ఇటీవల ఐజీ అశోక్ కుమార్ ఆదేశాలతో కేసులు పెట్టడం ఆరంభించారు. పోస్టుపై ఫిర్యా దు అందితే వెంటనే ఎఫ్ఐఆర్ వేసి చర్య లకు ఉపక్రమిస్తున్నారు.2022లో పోసాని కృష్ణమురళి అసభ్యకర పదజాలంతో ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రెచ్చిపోయారు. దీంతో అప్పట్లో జనసేన నాయకులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం కావడంతో పోలీసులు చేతులు కట్టేసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసులు నమోదు చేస్తున్నారు. ఒక కేసులో పోసానిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి జనసేన నాయకులు మరోమారు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేశారు. దానిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇలా ఒక్కో కేసు బయటకు లాగుతున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ మూకలు టీడీపీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ తదితరులపై చెత్త పోస్టులతో చెలరేగిపోయాయి. ఫేస్‌బుక్, వాట్సాప్,ఎక్స్, ఇన్‌స్టా.. ఇలా అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా వ్యక్తిగత విషయాల్లోనూ తలదూర్చి ఇంట్లో వాళ్లపైనా సిగ్గు తలదించుకొనే విధంగా పోస్టులు పెట్టారు.మార్పు కోసం నాలుగు నెలలు సమయం ఇచ్చిన సీఎం చంద్రబాబు..ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వస్తున్న ఫిర్యాదులతో యాక్షన్‌లోకి దిగక తప్పలేదు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని సైబర్ సెల్ నిరంతరాయంగా అసభ్యకర పోస్టులపై నిఘా పెట్టింది. సోషల్ మీడియాలో సభ్య సమాజం సిగ్గు పడే విధంగా వైసీపీ సైకోలు పోస్టులు పెడు తున్నా ఫిర్యాదు చేయడానికి చాలా మంది వెనుకాడుతున్నారని తెలుస్తోంది.జిల్లా స్థాయిలో ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో ఒక వాట్సాప్, టెలి గ్రాం నెంబరు ఏర్పాటు చేసి ఫిర్యాదు, సాక్ష్యాలు పంపాలని ప్రకటిస్తే మరింత ఉప యోగకరంగా ఉంటుంది. వాటి ఆధారంగా చర్యలకు ఉపక్ర మిస్తే సైకోలు అదుపులోకి అవకాశం ఉంది.

రెచ్చిపోతే వదిలిపెట్టం



సోషల్ మీడియాలో అసభ్యకర, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్న వారిపై గట్టి నిఘా పెట్టాం. వాటిని ఫార్వర్డ్ చేసినా నేరమే. ఇప్పటికే కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నాం. కొందరికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. సోషల్ మీడియాలో బాధ్యతతో వ్యవహరించాలి. లేనిపక్షంలో కేసులు ఎదుర్కోక తప్పదు. ఏదేమైనా రెచ్చిపోతే ఎవరైనా వదిలిపెట్టమని హెచ్చరిస్తున్నాం.- **నరసింహ కిషోర్, ఎస్పీ**

11 కేసులు.. ముగ్గురి అరెస్ట్

సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, నారా బ్రాహ్మణి, ప్రధాని మోదీ,ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజుపై అసభ్యకర పోస్టులు పెట్టడంపై కేసులు నమోదు చేశారు.ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రాజకీయ, రాజకీయేతర, వ్యక్తిగత, వివిధ సంఘాల సోషల్ మీడియా అడ్మిన్లకు పోలీసులు 610 వరకూ నోటీసులు ఇచ్చారు. 11 కేసులు నమోదు చేయగా ముగ్గురిని అరెస్టు చేశారు.రంగంపేటకు చెందిన వీరా బత్తుల చంద్రశేఖర్‌కు చందు వైఎస్ఆర్‌సీపీ పేరిట ఒక ఫేస్ బుక్ ఐడీ, చంద్రశేఖర్ 7799(ఇన్‌స్టా) ఉన్నాయి.వీటి ద్వారా పలు పోస్టులు పెట్టాడు.ఇతన్ని ఇటీవల గోపాలపురంలో అరెస్టు చేశారు.. స్టేషన్ బెయిల్‌పై విడుదలయ్యాడు. మార్గాని భరత్ అఫీషియల్ (ఇన్‌స్టా) పేరిట మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ రకరకాల పోస్టులు పెట్టడంపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది..ఇతన్ని అరెస్టు చేయాల్సి ఉంది.చూడచక్కని హెరిటేజ్ పాలు పేరిట ఒక గుర్తుతెలియని వ్యక్తి పేరిట ఫేస్ బుక్ ఐడీ ఉంది..ఇతనిపై కడియంలో కేసు లు నమోదయ్యాయి. ఇంటూరి రవికిరణ్ పేరున ఒక ఫేస్ బుక్ ఐడీ ఉంది.ఇతనిపై ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పులి సాగర్ 1995 పేరిట గుర్తు తెలియని వ్యక్తి ఫేస్‌బుక్ అకౌంట్ ఉంది.ఇతనిపై కూడా ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. కేవీఆర్ రాజు పేరిట ఫేస్ బుక్ ఐడీ కొంతం వెంకట రమణ రాజు పేరున ఉంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. హరీస్ వార్ రెడ్డి ఫేస్ బుక్ ఐడీని గుర్తు తెలియని వ్యక్తి కొన సాగించిన వ్యక్తిపై ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఫేస్‌బుక్ ఐడీ పేరిట కామెంట్స్ పెట్టిన రావూరి రవితేజపై బొమ్మూరు స్టేషన్‌లో కేసు నమోదైంది. హరికృష్ణారెడ్డి. కల్లాం.90 పేరిట కె.హరికృష్ణారెడ్డి ఫేస్ అకౌంట్ నుంచి కామెంట్స్ చేయడంపై ప్రకాశంనగర్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫేస్‌బుక్ ఐడీ పేరిట మేకా వెంకట రామిరెడ్డిచేసిన కామెంట్స్‌పై రాజానగరం స్టేషన్‌లో కేసు నమోదు కాగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంకా ఆయా సోషల్ మీడియా ఐడీలను బ్లాక్ చేయక పోవడం గమనార్హం.పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంతో సైబర్ సైకోలు రెచ్చి పోతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

గోదావరి నీటి సరఫరాపై కంటితుడుపు నివేదికలు వద్దు

- ఇరిగేషన్ అంటే కేవలం సాగునీటి కోసం కాదు
- అధికారుల అసంపూర్తి నివేదికపై కలెక్టర్ ఆగ్రహం
- వచ్చే సమావేశానికి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలి
- వాడివేడిగా సాగునీటి సలహా మండలి సమావేశం

రాజమహేంద్రవరం,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ అధికారులపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సాగునీటి సలహామండలి సమావేశానికి అరకొర వివరాలతో వచ్చిన ఇరిగేషన్ అధికారులకు ఆమె క్లాస్ తీసుకున్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సా యంత్రం రబీ సీజన్ ఏర్పాట్లకు నిర్వహించిన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమా వేశాన్ని అసంపూర్తిగా వాయిదా వేశారు. డిసెంబరు 1 నుంచి రబీ సీజన్ మొదలు పెట్టడానికి ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు,ఈఈ కాశీ విశ్వేశ్వ రరావు, పలువురు డీఈఈలు ఒక నివేదికతో హాజర య్యారు.ఇరిగేషన్ అధికారులు తెచ్చిన నోట్ చదివిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో డెల్టాల పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఎన్ని హెక్టార్ల ఆయకట్టు ఉంది.అక్కడ నీరు ఎంత అవసరం.ప్రస్తుతం గోదావరిలో నీరెంత. రబీకి ఎంత అవసరం.తక్కువ వస్తే ఏమి చేయాలని అనే ప్రశ్నలు సంధించారు. నీరు ఉందని చెబుతారు. ప్రతి ఏటా రైతులు ఎందుకు ఇబ్బంది పడుతున్నారు.తమ పొలాలు ఎండిపోయాయని ఎందుకు చెబుతుంటారు. మరి ఈ నివేదికలో ఇవేమీ ఎం దుకు ఉండవని ఆమె నిలదీశారు. గోదావరిలో నీరు సముద్రంలోకి పోతుంటుంది. ఎత్తి పోతల పథకాలకు, పరిశ్రమలకు సరిపడా నీరివ్వొచ్చుకదా, గోకవరం మండలంలో భూ గర్భ జలాలు తగ్గిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.గోదావరి ప్రక్కనే ఉన్న రాజమహేంద్రవరానికి పూర్తిగా మంచినీళ్లివ్వలేని పరిస్థితి ఉంది. కొవ్వూరు, నిడదవోలు వంటి ప్రాంతాలకు ఇంకా బోరు నీరే ఆధారం. అక్కడకు మంచినీళ్లు ఇవ్వడానికి ఎం దుకు ఆలోచించరని అన్నారు. ఇక కంటితుడుపు నివేదికలు వద్దని క్లాస్ తీసుకున్నారు. తూర్పుడెల్టా ప్రాంతంలోని కడియం, బిక్కవోలు, అనపర్తి మండలాలు, పశ్చిమ డెల్టా పరిధిలోని కొవ్వూరు కొంతభాగం, నిడదవోలు, పెరవలి మండలాల్లో ఎంత ఆయకట్టు ఉంది. గతేడాది ఏ సమస్య వచ్చింది. దానిని ఎలా అధిగమించాలని,మొత్తం నీరు ఎంత అవసరం అనే నివే దికలు సిద్ధం చేయాలన్నారు. పశ్చిమ డెల్టా ప్రాంత డీఈఈ గైర్హా జర్‌పై మండిపడ్డారు. రానున్న సమావేశానికి సమన్వయ శాఖల అధికారులతో పాటు సం బంధిత ఇరిగేషన్ అధికారులు పూర్తి నివే దికతో హాజరుకావాలన్నారు.సాగునీటిపై మండల వ్యవసాయ అధికారులు నివేదిక తయారు చేయాలన్నారు. వ్యవసాయ అను బంధ శాఖలు,నీటి సరఫరా, మునిసిపల్ ,ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు,మంచినీటి అవసరాలు, పరిశ్రమల నీటి అవసరాలతో కూడిన నివేదిక అందించాలన్నారు. ఎర్రకాలువ, కొవ్వాడ, చింతలపూడి, తొర్రిగడ్డ ప్రాజెక్టుల ఏఈలు ఆయా ప్రాజెక్టుల పరిధిలోని సీజన్‌వారీగా సాగు విస్తీర్ణం, సాగునీటి అందించడంలో సమస్యలపై నివేదిక అందించాలన్నారు.ఇరిగేషన్ సమావేశానికి కొంతమంది అధికారులే హాజరవడం.. ఇరిగేషన్ అధికారులు తయారు చేసి నోట్‌లో సరైన వివ రాలు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాన్ని వాయిదా వేసి.. పూర్తి వివరాలతో మరోసారి రావాలని పంపించేశారు. సమావేశంలో కొవ్వూరు ఆర్డీఓ రాణి సుష్మిత, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఇరిగేషన్ ఈఈ కాశి విశ్వేశ్వరావు, సీపీఎ ఎల్. అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ ఆఫీస్‌లో విచారణ

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం లోని జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయంలో ఏడాదిన్నరగా సాగుతున్న రగడపై మంగళవారం విచారణ జరిగింది. విజ యవాడ హెడ్ ఆఫీసుకు చెందిన ఆడిట్ జాయింట్ డైరెక్టర్ కనకదుర్గ సుమారు 11.30 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విచారణ జరిపారు. జిల్లా ఆడిట్ అధికారిణి పద్మజారాణికి అక్కడ పనిచేస్తున్న అసిస్టెంట్ ఆడిట్ అధికారులు, సీనియర్ ఆడిట్ అధికారుల మధ్య వివాదాలను ఇటీవల ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. జిల్లా ఆడిట్ అధికారి సుమారు 300 పేజీలపైగా ఆడిట్ రిపోర్టులు. , కొం దరు ఆడిటర్లు పంచాయతీలకు వెళ్లి ఆడిట్ చేయకుండా ఇచ్చిన నివేదికలపై రిపోర్టు అందజేసినట్టు సమాచారం. ఇక అసిస్టెంట్ ఆడిట్ అధికారులు, సీనియర్, జూనియర్ అధికారులు సుమారు 12 మంది తమ ఫిర్యాదును రాత పూర్వకంగా అందించినట్టు సమాచారం. విచారణ అధికారి కనకదుర్గ ఒక్కో అధికారిని ప్రత్యేకంగా పిలిచి వారి అభిప్రాయాలు వినడంతో పాటు రాతపూరకంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఎంక్వయిరీ రిపోర్టులను ఉన్నతాధికారులకు ఇస్తానని చెప్పి విచారణ అధికారి వెళ్లిపోయారు.

డ్రంకెన్ డ్రైవ్..
రూ.1.60 లక్షల జరిమానా
16 మందికి రూ.10 వేల చొప్పున

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లోని 16 మందికి కోర్టు రూ.10 వేల చొప్పున రూ.1.60 లక్షల జరిమానా విధించిందని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో ఇప్పటి వరకూ 381 కేసులు నమోదు చేశామన్నారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌పై నిరంతర తనిఖీలు చేస్తున్నామని ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించడం ప్రమాదమన్నారు.

ఇసుక.. రచ్చ రచ్చ


తీపర్రు ర్యాంపులో ఉచిత ఇసుక ట్రాక్టర్ల క్యూ

ఇసుక విధానం గందరగోళం చేశారు
జిల్లా ఎమ్మెల్యేలపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తి

రాజమహేంద్రవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉచిత ఇసుక అమలు విధానంలో సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.అమరావతిలో మంగళవారం ఆయన టీడీపీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో జిల్లాల వారీ సమీక్షించినపుడు తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక విధానాన్ని ధ్వంసంచేసినట్టు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ఉచిత ఇసుక విధానంలో ఇద్దరు ఎమ్మెల్యేల వైఖరి అసలు బాగాలేదు. ఇసుకవిధానాన్ని ధ్వంసం చేశారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.ఎవరా ఎమ్మెల్యేలు అనేది జిల్లాలో పెద్ద చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఇసుక నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉన్న సంగతి తెలిసిందే. ఇద్దరు ఎవరనే దానిపై జిల్లాలో చర్చ సాగుతోంది.

తీపర్రులో ఇసుక వివాదం

- ఉచిత ఇసుకపై గందరగోళం
- ఇవ్వలేమన్న కాంట్రాక్టర్
- వేరే ర్యాంపులో తవ్వకాలు
- దారివ్వకుండా ట్రాక్టర్ల అడ్డగింత
- సర్దుబాటు చేసిన తహశీల్దార్
- తీపర్రులో పశ్చిమ డిప్యూటీ కలెక్టర్
- ఇసుక ఇవ్వాలని ఆదేశాలు

పెరవలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక విధానం వివాదాలకు దారితీస్తోంది. ప్రభుత్వం ఆదాయం కోసం ఆలోచించకుండా ఉచిత ఇసుకకు అవకాశమిస్తే అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు..దీంతో అటు కాంట్రాక్టర్లు.. ఇటు ఉచిత ఇసుక ట్రాక్టర్ల యజమానుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. తాజాగా కోనసీమ జిల్లా రావులపాలెంలో ఇటీవల వివాదం తలెత్తగా అధికారులు సర్దుబాటు చేశారు. ప్రస్తుతం అటువంటి వివాదమే పెరవలి మండలం తీపర్రులోనూ నెలకొంది. తీపర్రులో కాంట్రాక్టర్ తీసుకున్న ర్యాంప్ నుంచి గోదావరిలో ఇసుకను మంగళవారం ఉదయం ట్రాక్టర్లపై స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు.ఇదిలా ఉండగా ఆయా గ్రామాల నుంచి సుమారు 30 నుంచి 40 ట్రాక్టర్ల వరకు ఉచిత ఇసుక తీసుకు వెళ్లేందుకు ర్యాంపునకు వచ్చాయి. ట్రాక్టర్లకు ఇసుక ఎగుమతి చేయడానికి కాంట్రాక్టర్, బంటా కార్మికులు నిరాకరించినట్టు సమాచారం. దీంతో ఆ పక్కనే ఉన్న మరొక ర్యాంప్ నుంచి ఉచిత ఇసుక ఉచితంగా తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ యజమానులు సిద్ధమయ్యారు. ఉసులుమర్రు వైపు గల ఈ ర్యాంప్‌లో సుమారు 20 ట్రాక్టర్ల వరకు ఇసుకను ఎగుమతి చేస్తున్నారు.కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన ర్యాంప్ నుంచి దిగిన ట్రాక్టర్లు వేరొక ర్యాంప్ ద్వారా పైకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే తమ ర్యాంప్ నుంచి ట్రాక్టర్లు కిందకు దిగడానికి వీల్లేదని ఇసుక కాంట్రాక్టు పొందిన వ్యక్తులు అక్కడ బాటకు అడ్డంగా మట్టి పోశారు. దీంతో వివాదం పెద్దదైంది.. ఇరువర్గాలు మాటామాటా అనుకున్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో తహశీల్దార్ అచ్యుతకుమారి సంఘటనా స్థలానికి చేరుకుని అనుమతి పొందిన ర్యాంప్‌లో మాత్రమే ఉచిత ఇసుక తీసుకోవాలని వేరొక ర్యాంప్ ద్వారా ఇసుక తీసుకెళ్లడం కుదరదని పేర్కొన్నారు. దీంతో ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు తమకు ఆ ర్యాంప్ నుంచి ఉచిత ఇసుక ఎగుమతి చేయకపోవడం వల్లే వేరొక ర్యాంప్ నుంచి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.దీనిపై స్పందించిన తహశీల్దార్ గోదావరిలో ఇసుక ఏ ప్రాంతంలో ఏ మేరకు తీయాలనేది గనుల శాఖ అధికారులు నిర్ణయించారని అందువల్ల అక్కడ మాత్ర మే ఇసుక తీయాలని చెప్పారు. తమకు ఆ కాంట్రాక్టర్ ఉచిత ఇసుక ఎగుమతి చేస్తే తమకు అభ్యంతరం లేదని ట్రాక్టర్ యజమానులు పేర్కొన్నారు.దీంతో త హశీల్దార్ ఆ కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఉచిత ఇసుక ఎగుమతి అయ్యేలా చూడాలని సూచించారు.


పశ్చిమకు ఇసుక సరఫరాపై తహశీల్దార్‌ను ప్రశ్నిస్తున్న డిప్యూటీ కలెక్టర్

పశ్చిమకూ ఇసుక ఇవ్వండి
డిప్యూటీ కలెక్టర్ కతీఫ్ కౌసర్ భాను

పెరవలి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): తీపర్రు ఇసుక ర్యాంప్‌లో పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన లారీలకు ఇసుక ఎందుకు ఎగు మతి చేయడం లేదంటూ తాడేపల్లిగూడెం డిప్యూటీ కలెక్టర్ కతీఫ్ కౌసర్ భాను ప్రశ్నించారు. తీపర్రు ఇసుక ర్యాంప్‌ను మంగళవారం పరిశీలించారు. ర్యాంపు నిర్వాహకులపై మండిపడ్డారు.ఇక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన లారీలకు ఇసుక ఎగుమతులు జరగాల్సి ఉన్నప్పటికి ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. దీంతో లారీలకు ఎగుమతి చేయడానికి తగినంత స్టాక్ లేకపోవడం వల్ల గోదావరి నుంచి స్టాక్ పాయింట్‌కు ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తున్నామన్నారు. స్టాక్ పాయింట్‌కు ఇసుక చేరుకున్న తరువాత ఎగుమతులు చేస్తామన్నారు.



ఇసుక సరఫరాకు ఇబ్బందులు కలిగించొద్దు
కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

నిడదవోలు/కొవ్వూరు,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక ర్యాంపుల నుంచి బయటకు సరఫరా చేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. రాత్రి సమ యాల్లో ర్యాంపుల నుంచి ఇసుక అక్రమ తరలిపోతుందన్న సమాచారంతో సోమవారం అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో నిడదవోలు మండలం పెండ్యాల, జీడిగుంట, పందలపర్రు, కొవ్వూరులో ఎరినమ్మ, దండగుంట,ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ర్యాంపుల్లో అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాంపుల్లో స్థానిక లారీలకు ఇసుక అందించడం లేదని, స్థానికేతరులకు ఇసుక అందిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు.ఇసుక సరఫరాలో ఆటంకాలు కలిగించవద్దన్నారు.ఆమె వెంట తహశీల్దార్లు బి.నాగరాజు నాయక్, ఎం.దుర్గాప్రసాద్, ఎస్ఐ కె.జగన్మోహనరావు ఉన్నారు.

వైసీపీకి రాజీవ్ కృష్ణ రాజీనామా
- 3లో

ఆన్‌లైన్‌లో ప్రకటన చూసి రూ.3 లక్షలు చెల్లింపు
-కుట్టుమిషన్ రాక లబోదిబో
- పోలీసులకు ఫిర్యాదు

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో ప్రకటన చూసి మోసపోయిన మహిళ ఉదంతమిది. ఎంబ్రాయిడరీ కుట్టుమిషన్ అమ్ముతానని చెప్పి మహిళను మోసగించిన సంఘటనపై కేసు నమోదు చేశారు. కొవ్వూరు పట్టణానికి చెందిన గుల్లపూడి సుప్రియ పద్మ ఫేస్‌బుక్ అకౌంట్‌లో మహిళల జాకెట్లు కుట్టే ఎంబ్రాయిడరి మిషన్ చూసి ఫోన్ చేసింది. ఫోన్ చేసిన అనంతరం రూ.3 లక్షలు అవుతుందని అవతలి వ్యక్తి చెప్పాడు. అవతలి వ్యక్తి మాటలను నమ్మిన పద్మ 2 దఫాలుగా న్యూఢిల్లీకి చెందిన అకౌంట్ నెంబరుకి 2024 జూన్ 25వ తేదీన రూ.3 లక్షలు జమ చేసింది. సొమ్ము చెల్లించిన అనంతరం ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఇప్పటివరకు వారి ఆచూకీ కోసం గాలించినా దొరకకపోవడంతో సుప్రియ పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసున మోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.



చెగోడీలకో.. ఊరు!

ఊరు పేరుమార్చిన ఉపాధి

కాకినాడ కాజ.. తాపేశ్వరం..కాజ..
ఆత్రేయపురం..పూతరేకులు..
రావులపాలెంలో కుండ బిరియాని..
కంద్రిక కోవా.. పాలకొల్లు పెసరట్టు..
ఇలా ఒక్కో ఊరు ఒక్కో దానికి ప్రసిద్ధి..
మరి చెగోడీలకు.. చెగోడీలకు ఒక
ఊరుందా అని ఆశ్చర్యపోతున్నారా..!
అవును ఉంది..అదెక్కడో కాదండోయ్..
మన కోనసీమ జిల్లాలోని కపిలేశ్వర
పురంలో.. పేరు నారాయణ లంక..
లంక గ్రామమైనా.. చెగోడీల లంకగా ప్రసిద్ధి
చెందింది.. ఒకసారి ఆ ఊళ్లోకి వెళదాం..
వారేం చేస్తున్నారో చూద్దాం..!

- » చెగోడీలకు కేరాఫ్ నారాయణలంక
- » కపిలేశ్వరపురంలో ఓ కుగ్రామం
- » 25 కుటుంబాలకు జీవనాధారం
- » ఉద్యాన పంటల నుంచి ఉపాధి వైపు
- » ఆర్డర్ల మేరకు సరఫరా
- » రోజూ వందల కిలోల తయారీ
- » హైదరాబాద్‌లోనూ డిమాండ్

కపిలేశ్వరపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అదొక లంక గ్రామం.. గోదావరి గలగలలతో.. ఆహ్లాదకరమైన వాతావరణంలో అక్కడి ప్రజలు ఒకప్పుడు ఉద్యానపంటలపైనే ఆధారపడి జీవించేవారు.కానీ కాలం మారింది. ఖర్చులు పెరిగాయి.దీంతో పల్లెల్లో కుటుంబాలు పంటల నుంచి వంటల వైపు అడుగులు వేస్తున్నాయి. ఒకరికి ఒకరు తోడై నోరూరించే చిరుతిళ్లు తయారు చేసి విక్రయిస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు.ఇలా ఆ గ్రామం చెగోడీ, జంతికల తయారీకి కేంద్రంగా మారి కొందరికి ఆదాయ వనరుగా నిలుస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం..



15 ఏళ్లుగా చెగోడీల తయారీ..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం పంచాయతీ పరిధిలో నారాయణలంక లంక గ్రామం ఉంది.గోదావరికి ఇటుపక్క కపిలేశ్వరపురం, అటుపక్క నారాయణలంక ఉన్నాయి. కొత్తపేట-ముక్తేశ్వరం రహదారిని చేర్చి ఉన్న గ్రామంలో ఒకప్పుడు కేవలం ఉద్యాన వ్యవసాయమే జీవనాధారం. కానీ 15 ఏళ్లుగా చెగోడీల తయారీతో గ్రామం ప్రసిద్ధి గాంచింది.ఈ గ్రామంలో 289 నివాసాలు ఉన్నాయి. 1200 మంది జనాభా ఇందులో 656 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. అత్యధిక ప్రజలు లంకగ్రామంలోనే ఉన్నారు.

నష్టాలతో మూసివేత

జీవితం అన్నాక ఒడిదుడుకులు.. వ్యాపారం అన్నాక లాభనష్టాలు సహజం.. ఇక్కడ వీళ్లదీ ఇదే పరిస్థితి.. ఎన్నో ఏళ్లుగా చెగోడీల తయారీకి ప్రసిద్ధిగాంచిన ఈ గ్రామంలో తయారీదారులకు ఒక్కోసారి కష్టాలు తప్పడంలేదు. చిన్న పరిశ్రమగా పదుల సంఖ్యలో కుటుంబాలు సొంతంగా వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ నష్టాల బాట పట్టి కొందరు ఈ రంగాన్ని వీడారు. పెట్టుబడులు ఎక్కువైపోవడం,నిత్యావసర ధరలు, వ్యాపారం సరిగ్గా జరగకపోవడం వంటి కారణాలతో కొందరు తయారీ ఆపేశారు.

చెగోడీల తయారీ విధానం

ఇక్కడి గ్రామస్తులు చెకోడీ తయారు చేసే విధానం ఇలా ఉంది. వరిపిండి, శనగపిండి ఉడకబెట్టి మిషన్‌లో వేసి ముద్దగా అయిన తర్వాత దాన్ని గంటసేపు వరకూ నానబెడతారు. ఆ తర్వాత దాన్ని ఉండలుగా చేస్తారు. శనగపప్పును శుభ్రంగా కడిగి ఆరబెడతారు. నానబెట్టిన పిండిని ఉండలుగా చేసి పిండిని పొడవుగా తయారు చేస్తూ గుండ్రంగా చుట్టి వాటిపై శనగపప్పును అద్దుతారు. ఆపై కళాయిలో నూనె వేడెక్కిన తర్వాత వాటిని అందులో వేసి వేపుతారు. వేడి తగ్గిన తర్వాత వాటిని ప్యాకింగ్‌లు చేసి అమ్మకాలు సాగిస్తుంటారు.



ఆర్డర్ల మేరకు సరుకు పంపుతాం



రూ.3లక్షల ఖర్చుతో ఐదేళ్ల క్రితం ఈ వ్యాపారాన్ని ప్రారంభించా. మా కుటుంబీకులు 10మంది పనిచేస్తున్నారు. ఆర్డర్ల మేరకు సరుకు పంపుతాం. రోజుకు 70 కిలోల సరుకు తయారు చేస్తాం. కిలో రూ.130కు విక్రయిస్తాం. లాభాలు అంతంత మాత్రమే.
-సుంకర కోటేశ్వరరావు, నారాయణలంక

ఆశించిన మేర లాభాల్లేవు



వ్యాపారాన్ని 3 నెలల క్రితం ప్రారంభించా. మా కుటుంబమంతా కష్టపడి పని చేస్తున్నాం. తయారు చేసిన సరుకును హైదరాబాద్‌కు పంపిస్తాం. రోజుకు 60 కిలోల సరుకు తయారు చేసి కిలో రూ.140కు సరఫరా చేస్తాం.ఆశించిన మేర లాభాల్లేవ్.
- ఎస్.నాగబాబు, నారాయణలంక

ఎనిమిదేళ్లుగా వ్యాపారం



ఎనిమిదేళ్ల కిందట జంతికల వ్యాపారం ప్రారంభించా. ఐదు కిలోలతో ప్రారంభించిన ఈ వ్యాపారం ప్రస్తుతం 30 కిలోలకు పెరిగింది. సమీపంలోని షోడా, కిరాణా షాపులకు సరుకు తీసుకువెళ్లి వేస్తాం. వచ్చిన సొమ్ముతోనే జీవనం సాగిస్తున్నాం.
- కుప్పాల నాని, నారాయణలంక



దూరప్రాంతాలకు సరఫరా

నారాయణలంక గ్రామస్తుల వ్యాపార ఆలోచన లంక గ్రామానికి బయటవారితో పెనవేసుకుపోయేలా చేసింది. గ్రామంలో దాదాపు 25 కుటుంబాల వారు తమ ఇళ్లల్లోనే చెగోడి, జంతికలు తయారు చేస్తున్నారు. వీరి మార్కెట్ అంతా లంక గ్రామాలకు బయట ఉన్న గ్రామాలతోనే ముడిపడిఉంది.తయారు చేసిన సరుకును వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్డర్ల ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో వ్యాపారం సాగిస్తున్నా రు.కొంతమంది హైదరాబాద్ వంటి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా గ్రామంలో 15 ఏళ్లుగా చెగోడీ తయారు చేస్తూ జీవనోపాధి పొందుతూ పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

వైకల్యాన్ని బాస్కెట్‌లో.. పడేశాడు!


పట్టుదలతో జయించాడు: బాస్కెట్ బాల్ ఆడుతున్న బధిర దివ్యాంగ యువకుడు ఏసుకుమార్

అన్నీ అవయవాలు సరిగ్గా ఉంటేనే చాలా మందికి ఆటలు ఆడేందుకు సమయం ఉండదు.. అతను అలా కాదు.. దివ్యాంగత్వం ఉన్నా కఠోర శ్రమతో జయించాడు.. వైకల్యాన్ని బాస్కెట్‌బాల్‌తో ఆడేస్తున్నాడు.. అంతర్జాతీయస్థాయిలో తన ప్రతిభ చాటేందుకు ఇటీవల ఆస్ట్రేలియా కూడా వెళ్లి వచ్చిన ఈ పిఠాపురం కుర్రాడికి గురించి తెలుసుకుందాం...

ఆటతో వైకల్యాన్ని జయించాడు..

- » వృత్తి వెల్డింగ్.. ప్రవృత్తి బాస్కెట్ బాల్..
- » రాష్ట్ర, జాతీయస్థాయిలోపదికి పైగా బహుమతులు
- » అంతర్జాతీయ పోటీల్లో సైతం పాల్గొన్న యువకుడు


వెల్డింగ్ పనిచేస్తూ..



పిఠాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అతడి ప్రతిభకు అంగవైకల్యం అడ్డురాలేదు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా అన్నింటా ముందడుగు వేశాడు. తండ్రి మరణించి కుటుంబపోషణ భారమంతా తనపై పడినా ఆటపై మక్కువ వీడలేదు. వెల్డింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూనే బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించడమే కాదు...రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పదికి పైగా బహుమతులు సాధించి ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని వచ్చాడు. పిఠాపురం పట్టణానికి చెందిన ఉమ్మిడి ఏసుకుమార్ మూగ, చెముడు సమస్యతో బాధపడుతూ బీకాం వరకూ చదువుకున్నాడు. అయినా ఉద్యోగం రాక వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి వెంకటలక్ష్మితో కలిసి నివసిస్తున్నాడు. పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకూ చదివిన ఏసుకుమార్‌కు ఆ సమయంలోనే బాస్కెట్ బాల్‌పై ఆసక్తి కలిగింది. అక్కడే ఉన్న క్రీడామైదానంలో శిక్షణ పొందుతూ ఆటపై పట్టు సాధించాడు. రాష్ట్ర జాతీయస్థాయి పోటీల్లో బహుమతులు సాధించాడు.

ఉభయ రాష్ట్రాల నుంచి ఒక్కడే ..

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ వచ్చిన ఏసుకుమార్ తన ఆట ద్వారా దేశానికి పేరు తీసుకురావాలనే ధృడసంకల్పంతో ముందడుగు వేశాడు.2016లో జరిగిన రాష్ట్రస్థాయి యూత్ చాంపియన్‌షిప్ జనరల్ కేటగిరీ విభాగంలో పాల్గొని తొలి బహుమతి సాధించాడు. అక్కడి నుంచి ఏసుకుమార్ పాల్గొన్న ప్రతి పోటీలోనూ రాణిస్తూనే ఉన్నారు. 2017లో మధ్యప్రదేశ్‌లో జరిగిన సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో, 2018లో రాష్ట్ర జూనియర్ చాంపియన్‌షిప్, 2022లో జరిగిన స్టేట్ సీనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జట్టును ప్రథమస్థానంలో నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. 2022లో బెంగళూరులో జరిగిన బధిరుల బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో డఫ్ ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో ఆసియా, పసిఫిక్ దేశాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాడు.ఈ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక స్థోమత సహకరించకపోవడంతో దాతలు సహకరించారు. మెల్‌బోర్న్‌లో జరుగుతున్న పోటీలకు దేశవ్యాప్తంగా 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏసుకుమార్ ఒక్కరే ఎంపికవడం అతడి ప్రతిభకు నిదర్శనం. తమిళనాడు నుంచి ఆరుగురు, కర్నాటక నుంచి ముగ్గురు, ఒడిసా నుంచి ఒకరికి అవకాశం లభించింది.

అతడి ఏకాగ్రతే ఈ స్థాయికి చేర్చింది

ఆటలో చూపిన ఏకాగ్రత, ఆత్మవిశ్వాసమే ఏసుకుమార్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా చేసింది. ఏ నాడు తనకు ఉన్న లోపాన్ని తలచుకుని బాధపడకుండా సాధారణ క్రీడాకారులతో పోటీపడుతుండడమే అతడ్ని ఇంతవాడ్ని చేసింది.
- బొజ్జా మాణిక్యాలరావు, ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి తొలి నామినేషన్ దాఖలు

● పీడీఎఫ్ అభ్యర్థిగా గోపి మూర్తి

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రెండోరోజు పశ్చిమ గోదావరిజిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్‌కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం దర్నాచౌక్ రోడ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పీడీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా నన్ను గెలిపించిన వెంటనే షేక్‌సాబ్జీ ఆశయాలను సాధించడానికి నిరంతరం పనిచేస్తానన్నారు. పీడీఎఫ్ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల, శ్రామికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. విద్యారంగ పరిరక్షణ కోసం పాటుపడతానన్నారు. అనంతరం ఈ సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కృష్ణ, గుంటూరు పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా గోపిమూర్తిని మొదటి ప్రాధ్యానం ఓటు వేయించి భారీ మెజారిటీతో గెలిపించి ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయబ్రహ్మం, యూటీఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సుబ్బరావమ్మ, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.


పీడీఎఫ్ అభ్యర్థిగా ఉప్యాధాయ ఎమ్మెల్సీకి నామినేషన్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న గోపిమూర్తి

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన
పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల


రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్

కాకినాడ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతి సచివాలయంలో తూర్పు-పశ్చిమ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను రాజశేఖర్ వివరించారు. ఉభయగోదావరి జిల్లాల కూటమి ఇన్‌చార్జి మం త్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జిల సహకారంతో ఓటరు నమోదు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పట్టభద్రులందరికీ అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు జరుగుతుందని తెలిపారు.

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి
త్రీడీ విగ్రహం

మండపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటకు చెందిన దొంతంశెట్టి బాలనాగేశ్వరరావు సూక్ష్మ చిత్ర కళాకారుడు. పట్టణంలో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒక మిల్లీ గ్రాము బంగారం, మిల్లీమీటర్ సైజులో చిన్న సైజు సూది రంధ్రంలో పట్టే విధంగా 3డీ విగ్రహాన్ని సోమవారం తయారుచేసి స్వామి వారికి సమర్పించారు.


బాలనాగేశ్వరరావు తయారు చేసిన వీరబ్రహ్మేంద్రస్వామివారి 3డిచిత్రం

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.80లక్షలు

ఆత్రేయపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,80,584 లభించినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

● కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక బుధవారం క్షీరాబ్దిద్వాదశి సందర్భంగా గోదావరినదిలో సాయంత్రం తెప్పోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మాజీ సీఎం జగన్ ఫొటోతో
ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ

● కాకినాడలోని గొడారిగుంటలో మీసేవా కేంద్రం నిర్వాహకుడి నిర్వాకం
● మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం



మీ సేవా నిర్వాహకులు జారీ చేసిన ఇన్‌కమ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్

సర్పవరం జంక్షన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదునెలలు కావస్తోంది. కానీ, ఇప్పుడు జగన్ ఫొటోతో ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఓ విద్యార్థి ఇన్‌కమ్ సర్టిఫికెట్ కోసం మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే. మాజీ సీఎం జగన్ ఫొటోతో ముద్రించి ఉన్న సర్టిఫికెట్ జారీ చేయడంతో ఆ విద్యార్థి విస్తుపోయాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన గురుజు లోహిత్ సాయి కుమార్ విద్యాభ్యాసం కోసం ఇన్‌కం అండ్ అసెట్ సర్టిఫికెట్(ఈడబ్ల్యూఎస్) కోసం కాకినాడ కార్పొరేషన్ 3వ డివిజన్ గొడారిగుంటలోని మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈనెల 10న ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ 24-25 సంవత్సరానికి చెల్లుబాటు అయ్యేలా కాకినాడ రూరల్ తహశీల్దార్ సిస్ట లక్ష్మీ నరస కుమారి డిజిటల్ సంతకంతో సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ సర్టిఫికెట్‌ను మాజీ సీఎం జగన్ ఫొటోతో జారీ చేయడాన్ని గుర్తించి మీసేవా నిర్వాహకుడ్ని అడిగాడు. ఏం పర్వాలేదు.. కొత్త సర్టిఫికెట్లు అయిపోయాయి. పాత సర్టిఫికెట్‌తో ఇచ్చేశా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆ బాలుడు విస్తుపోయాడు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయాన్ని సైతం పట్టించుకోకుండా మాజీ సీఎం జగన్ ఫొటోతో సర్టిఫికెట్ జారీ చేయడాన్ని విద్యార్థి తప్పుపట్టాడు. దీనిపై కాకినాడ రూరల్ తహశీల్దార్ కుమారిని వివరణ కోరగా మీసేవా కేంద్రాల నిర్వహణ కలెక్టర్ కంట్రోల్ ఉంటుందని తెలిపారు. ఈ విషయమై తన దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు లేఖ రాశానని తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

● విజేతలుగా నిలిచిన తూర్పుగోదావరి బాలికల జట్లు


అండర్ 19, 17 బాలుర, బాలికల విభాగాల్లో విజేతగా నిలిచిన పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల జట్లు

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్ - 19 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, బాలికల విభాగంలో తూర్పుగోదావరి, అండర్-17 బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లాల జట్లు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. కాగా అండర్ 19 బాలుర విభాగంలో విశాఖపట్నం జట్టు, బాలికల విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు, అండర్-17 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. అదేక్రమంలో అండర్-19 బాలుర విభాగంలో తూర్పుగోదావరి, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి, అండర్-17 బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు అధికారులు ట్రోఫీని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.గోపాల్, ఆర్ఐపీఈ షేక్ మహబూబ్‌బాష, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ అనంతలక్ష్మీ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చా తిరుపతయ్య, పీడీలు ఎన్ ప్రభాకర్‌రెడ్డి, పీ థామస్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మేమున్నాం..

● మహిళా రక్షక్ టీం ర్యాలీ

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు ఎస్పీ నరసింహ కిషోర్ ఏర్పాటుచేసిన మహిళా రక్షక్ టీం ప్రతిక్షణం సిద్ధమని శాంతిభద్రతల విభాగం అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పేర్కొన్నారు. ఆయన పర్యవేక్షణలో సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్, మహిళా పీఎస్ సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా రక్షక్ టీం పోలీసులు ర్యాలీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఏవీఏ రోడ్, ఆర్టీసీ కాంప్లెక్స్, కోటిపల్లి బస్టాండ్, దేవీచౌక్ గుండా మహిళా పోలీస్ స్టేషను వరకూ ఈ ర్యాలీ సాగింది. మహిళల్లో ధైర్యాన్ని నింపి వారికి పోలీసులు అండగా ఉంటారని భరోసా కల్పించడానికి, వారిపై దాడులను అరికట్టడానికి ఈ అవగాహనా ర్యాలీ చేపట్టామని ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు.


మహిళా రక్షక్ టీం పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పంట కాలువలోకి వెళ్లిపోయిన కారు

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఆత్రేయపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం ప్రధాన కాలువలోకి మంగళవారం ఉదయం ఓ కారు దూసుకెళ్లింది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం వైపు వస్తున్న కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే స్పందించారు. అక్కడకు వచ్చి కారును బయటకు తీశారు. దీంతో అందులో వున్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు.



భీమేశ్వర స్వామిని దర్శించుకుంటున్న అఘోరీ

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న అఘోరీ

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయానికి అఘోరీ సోమవారం రాత్రి ప్రత్యేక వాహనంలో చేరుకుంది. ఆలయ తలుపులు మూసివేసినందున తెల్లవారుజామున రావాలని అధికారులు, పోలీసులు సూచించారు. దీంతో ఆమె మంగళవారం తెల్లవారుజామున ఎరుపు వస్త్రం ధరించి ఆలయంలోకి ప్రవేశించింది. తనదైన శైలిలో భీమేశ్వర స్వామిని ప్రార్థించి వెనుదిరిగింది. మహిళా పోలీసులతో బందోబస్తు చేపట్టారు. అఘోరీతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.



పంపా సరోవరంలో సత్యదేవుని విహారానికి సిద్ధం చేసిన హంస వాహనం

నేడు సత్యదేవుని తెప్పోత్సవం

- సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం కానున్న తులసిధాత్రి పూజ
- రాత్రి ఏడు గంటలకు హంస వాహనంపై పంపా సరోవరంలో విహరించనున్న స్వామి, అమ్మవార్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అన్నవరం దేవస్థానం అధికారులు

అన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి జరిగే వార్షిక వే డుకల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన స్వామివారి తెప్పోత్సవం నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రతిఏటా క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన ఈ వేడుక నిర్వహిస్తారు. ఇప్పటికే హంస వాహనాన్ని ముస్తాబు చేశారు. తులసిధాత్రి పూజ జరిపేందుకు పంపా తీరం వద్ద వేదికను సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. సాయంత్రం 4.30 గంటలకు రత్నగిరిపై నుంచి స్వామి ,అమ్మవార్లను, క్షేత్ర పాలకులైన సీతారాములను మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో కొండ దిగువున పంపా సరోవరం వద్దకు తోడ్కొనివచ్చి తులసిధాత్రి పూజ చేస్తారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లకు పంపా సరోవరంలో ముమ్మారు ప్రదక్షిణ గావిస్తారు. ప్రముఖులెవ్వరూ కాకుండా వైదిక బృందం మాత్రమే హంసవాహనం ఎక్కేందుకు చర్యలు చేపట్టారు. ప్రముఖులు వీక్షించేందుకు తీరం ఒడ్డున ప్రత్యేక వీఐపీ గ్యాలరీ ఏర్పాటుచేస్తున్నారు. రంగురంగుల విద్యుద్దీపాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా వచ్చే ప్రజలు ప్రత్యక్షంగాను, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా భక్తులు పరోక్షంగాను వీక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫైర్, అంబులెన్స్ వాహనాలు, గజ ఈతగాళ్ళు, లైఫ్ జాకెట్లను సిద్ధం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో సుమారు 100 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సత్యదేవుని సన్నిధి కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రద్దీగా మారింది. తెల్లవారుజామున రెండు గంటల నుంచి వ్రతాలు, మూడు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. వేకువజామున నాలుగు గంటలకే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సుమారు 6వేల జంటలు సత్యదేవుని వ్రతాలు ఆచరించుకోగా స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.65 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుమారు 30వేల మంది భక్తులకు ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్నదాన విభాగం ఏఈవో బి.వెంకటరెడ్డి పర్యవేక్షణలో ఉచిత పులిహోర పంపిణీ చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు క్యూలైన్లలో వేచియుండాల్సి వచ్చింది.





తులసిధాత్రి పూజకు సిద్ధమవుతున్న వేదిక, స్వామి దర్శనం కోసం వేకువజామున నాలుగు గంటలకు క్యూలైన్లలో వేచియున్న భక్తులు





జేగురుపాడులో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ట్రైనీ కలెక్టర్లు, పొట్టిలంకలో ఓ వీధిని శుభ్రపరుస్తున్న ట్రైనీ కలెక్టర్లు

యువ కలెక్టర్ల పల్లె బాట

కడియం మండలం జేగురుపాడు, పొట్టిలంకల్లో క్షేత్ర స్థాయి పర్యటన... సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరుతెన్నులు పరిశీలన

కడియం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాలకు చెందిన పది మంది ట్రైనీ కలెక్టర్లు రెండు రోజుల క్షేత్ర స్థాయి శిక్షణలో భాగంగా మంగళవారం తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలో పర్యటించారు. రెండు బృందాలుగా ఏర్పడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరుతెన్నులను పరిశీలించారు. ఓ బృందం జేగురుపాడు గ్రామాన్ని సందర్శించగా మరో బృందం పొట్టిలంకలో పర్యటించింది. జిల్లా, మండల స్థాయి అధికారులు వారి వెంట ఉండి ఏఏ పథకాలు ఎలా అమలవుతున్నాయో ప్రత్యక్షంగా చూపించారు. తొలుత జేగురుపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన అనురాగ్ బాబెల్ (టీమ్ లీడర్), ప్రియారాణి, ఎస్.బేగం, పారత్, కె.భక్తి బృందానికి సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ స్వాగతం పలికారు. అక్కడ చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని పరిశీలించారు. వాటి పనితీరును జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, డీఆర్డీఏ పీడీ మూర్తి, ఎంపీడీవో రమేష్, ఏవో సుబ్బారావు, ఈవోపీఆర్డీ రాంప్రసాద్ వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఏ విధంగా సహకారం అందిస్తున్నామో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు డిజిటల్ బోర్డు ద్వారా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులు, గర్భిణులకు ఆహారాన్ని ఎలా అందిస్తున్నారో పీడీ కె.విజయకుమారి ద్వారా తెలుసుకున్నారు. పిల్లలకు పెడుతున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఈ బృందానికి డాక్టర్ జ్యోత్స్న గ్రామ స్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. అనంతరం సచివాలయానికి చేరుకుని ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిశీలించి విద్యా విధానంపై ఆరా తీశారు. డ్వాక్రా మహిళలతో సమీక్షించి రుణ సదుపాయం, వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్లో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ పథకాల వివరాలను డిజిటల్ స్క్రీన్‌పై ఆయా శాఖల అధికారులు ట్రైనీ కలెక్టర్లకు వివరించారు.

పొట్టిలంకలో ట్రైనీ కలెక్టర్లు నిరంజన్ జయదేవరావు (అసిస్టెంట్ టీమ్ లీడర్), టి.నాగి, ఎ.మిశ్రా, స్నేహ పన్నా పర్యటించారు. వారికి సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి, వైస్ ఎంపీపీ కలిదిండి విశాలాక్షి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. డీఎల్డీవో వీణాదేవి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుజాతకుమారి, వ్యవసాయ శాఖ ఏడీ టీవీఎస్ రెడ్డి, సీడీపీవో కనకవల్లి బృందం వెంట ఉండి ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులను వివరించారు. స్థానికులు, లబ్ధిదారులతో మాట్లాడించారు.

శిశు మరణాల అడ్డుకట్టకు చర్యలు

చింతూరు డివిజన్ అధికార యంత్రాంగాన్ని కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం



రామన్నపాలెంలో వైద్య శిబిరంలో చిన్నారిని పరీక్షిస్తున్న తులసిపాకల పీహెచ్‌సీ డాక్టర్ నిఖిల్

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మన్యంలో చోటుచేసుకుంటున్న శిశు మరణాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం వరుస చర్యలు మొదలు పెట్టింది. 'మన్యంలో రాలుతున్న పసిమొగ్గలు' శీర్షికన ఈ నెల ఏడో తేదీన ఆంధ్రజ్యోతిలో వచ్చిన ప్రత్యేక కథనం అధికారుల్లో కదలిక తీసుకొచ్చింది. గడచిన ఏడు నెలల కాలంలో చింతూరు డివిజన్లో 49 మంది పసికందులు పొత్తిళ్లలోనే కన్నుమూయడం దయనీయం. మాతా, శిశు మరణాలు చోటుచేసుకోకూడదన్నది లక్ష్యం. కాగా ఏడు నెలల వ్యవధిలోనే చింతూరు డివిజన్లో 49 మంది చిన్నారులు మృత్యువాతపడడమన్నది అంత చిన్న విషయమేమీ కాదు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ స్పందించారు. ముందుగా డివిజన్ స్థాయి వైద్యులు, వైద్యాధికారులతో పీవో సమావేశమయ్యారు. డివిజన్‌వ్యాప్తంగా ఇంటింటా సర్వేతో పాటు కూడళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని పీవో ఆదేశించారు. ఏడాదిలోపు వయసున్న చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీసి అవసరమైతే వెంటనే ఆసుపత్రులకు తరలించాల్సిందిగా పీవో ఆదేశించారు. మారుమూలల్లో, గుట్టలపైన గ్రామాలు ఉండి ఉండడంతో సర్వే పూర్తి చేసేందుకు వారం గడువు ఇవ్వాల్సిందిగా వైద్యులు పీవోని కోరారు.

ఇదిలా ఉండగా నాటు వైద్యం కూడా శిశు మరణాలకు ఒక కారణంగా ఉందని వైద్యులు పీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సోమవారం డివిజన్లోని దాదాపు వంద మంది నాటు వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించిన విషయం విదితమే. మొత్తంగా పది పీహెచ్‌సీలకు చెందిన 20 మంది వైద్యులు, సిబ్బంది రంగంలోకి దిగి వారి పరిధిలోని చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పరీక్షిస్తున్నారు.



కాజ్‌వే మరమ్మతులకు రూ.9.8 లక్షలు మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజవొమ్మంగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలో నెల్లిమెట్ల కాలనీ-నెల్లిమెట్ల గ్రామాల మధ్య కాజ్‌వే ఓ వైపు కొట్టుకుపోయిన వైనంపై 'కాజ్ వేపేదీ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాజ్‌వే మరమ్మతులకు రూ.9.8 లక్షలు మంజూరు చేశామని, పనులు ప్రారంభమవుతాయని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈ గౌతమి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రజలు, ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు నలుగురు ఎంపిక



జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన గౌతమి శిక్షణ శిబిరం క్రీడాకారులు

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు గౌతమి శిక్షణ శిబిరానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని కొవ్వూరు గౌతమి వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టులో మానికల మహాలక్ష్మి (జంగారెడ్డిగూడెం), కడియం మహాశ్రీలక్ష్మి (ధర్మవరం), బాలుర జట్టులో పి.నవీన్‌కుమార్ (దుద్దుకూరు), యు.ప్రవీణ్ (కొవ్వూరు) ఉత్తమ ప్రతిభ కనబర్చారు. డిసెంబరు నెలలో ఉత్తరప్రదేశ్‌లోని వారాణసిలో జరిగే జాతీయ పోటీల్లో ఈ నలుగురూ రాష్ట్ర జట్టు తరపున ఆడతారని అసోసియేషన్ కార్యదర్శి కొయ్యల ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌లు కె.రామ్‌కుమార్, పి.సత్యనారాయణ, ఆర్.సురేష్, పి.గంగాధర్‌లను అభినందించారు. కార్యక్రమంలో కొడాలి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శ్రీనివాసరావు

పెనుగొండ కళాశాలలో 27, 28 తేదీల్లో

అంతర్జాతీయ తెలుగు సదస్సు

దివాన్‌చెరువు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం, పెనుగొండలోని ఎస్వీకేపీ-డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. 'విశ్వర్షి వాసిలి వాఙ్మయ వరివస్య' అంశంపై పెనుగొండ కళాశాలలో సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎస్వీకేపీ కళాశాల కరస్పాండెంట్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ వైవీ అప్పారావు, కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య రంకిరెడ్డి రామ్మోహనరావు, నన్నయ వర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు కేవీఎన్‌డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడ్డ వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన దిమ్మిలి కృష్ణ (36) ఈ నెల 28వ తేదీన సుబాబుల్ చెట్లు నరికే పనిలోకి వెళ్లాడు. చెట్లు నరుకుతూ ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం



పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణం మంగళవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఉదయం పసుపుకొట్టే కార్యక్రమంలో మహిళలు పాలుపంచుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణాలంకారం జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్వామి అమ్మవార్ల పాదుకా ప్రక్షాళన గావించారు. గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద లగ్నాష్టకాలు, చూర్ణిక తదితర వేదమంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు పట్టు వస్త్రాలు సమర్పించారు. యాజ్ఞిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో ఆలయ అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు, ఆలయ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, రామ్‌మోహన్, మల్యాల గోపాలకృష్ణ, అప్పలరాజు, కొల్లూరి లక్ష్మి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న పీడీజే గంధం సునీత

జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. మంగళవారం ఆమె విద్యుత్, కార్మిక, మునిసిపల్ శాఖల అధికారులు, వినియోగదారుల ఫోరం సభ్యులతో సమావేశమయ్యారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఆయా శాఖలు, సంస్థల్లో పెండింగులో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్, రాజీకి అర్హమైన అన్ని కేసులను గుర్తించి ఆ జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని ఆమె సూచించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో ఏకాహం

చాగల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నెలటూరులోని సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఏకాహం నిర్వహించి భజనలు, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక వేపర్ల వారి రామాలయంలోను ఏకాహ భజనలు జరిగాయి.

గోదావరిని శుభ్రంగా ఉంచండి

» కోటిలింగాల పేట వద్ద ఈట్ స్ట్రీట్‌ను సిద్ధం చేయాలి
» కమిషనర్ కేతన్ గార్గ్


కోటిలింగాలరేవులో ఈట్‌స్ట్రీట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోటిలింగాల పేట వద్ద ఉన్న ఈట్ స్ట్రీట్‌ను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం కోటిలింగాలరేవు, ఆర్యాపురం, కోటగుమ్మం సెంటర్, వీఎల్ పురం తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. కోటిలింగాల రేవు వద్ద ఈట్ స్ట్రీట్‌లో ఉన్న చిన్నచిన్న పనులు పూర్తి చేయాలన్నారు. ఆయా షాపులను వేలం వేయాలని ఆదేశించారు. ఆర్యాపురం నల్లా చానల్ వద్ద ఇరిగేషన్ డిపార్టుమెంట్ భవనం స్థలంలో గోషాల ఏర్పాటు చేయడానికి వచ్చిన ప్రతిపాదనను పరిశీలించారు. అనంతరం పుష్కరాల రేవును పరిశీలించారు. గోదావరి నదిలో తేలుతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి నదిని పరిశుభ్రంగా ఉంచాలని, కార్తీకమాసం సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోటగుమ్మంసెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలని సూచించారు. వీఎల్ పురం చేరుకుని అక్కడ ఉన్న పార్కును సందర్శించి ప్రహరి గోడ నిర్మించాలని, నడకదారిలో పేవర్ బ్లాకులు ఏర్పాటు చేయాలని, గ్రిల్స్ పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మదర్సాఆలీ, సిటీ ప్లానర్ కోటయ్య, డీఈ ప్రసాద్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు ఉన్నారు.

15న పట్టభద్రుల ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు పట్టభద్రులు అందరూ ఓటర్లుగా నమోదు కావాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడారు. ఈనెల 15న రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకూ ఓటరు నమోదు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో సంఘం డిప్యూటీ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జార్జి ఆంథోని, సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంపీడీవోలు గూగుల్‌షీట్ ఏర్పాటు చేసి దివ్యాంగుల అవసరాలను గుర్తించాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు ప్రతి మొదటి సోమవారం పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల పునరావాస కేంద్రం అద్దె భవనంలో ఉన్నందున దాన్ని పరిశీలించి ప్రభుత్వ భవనంలోకి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని సోషల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఎదుగుదల లేని పిల్లలను ముందుగానే గుర్తించాలని, ఐదేళ్లలోపు పిల్లల ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విజిలెన్స్ నిర్వహణ

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్‌ల వద్ద క్షేత్రస్థాయిలో విజిలెన్స్‌ను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో ఇసుక రవాణా ట్రాన్స్‌పోర్టర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రోజు 30వేల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నా ఇంకా ఇసుక సరఫరా విధానంలో ఉద్దేశ్య పూర్వకంగా ఇబ్బందులు కలుగజేస్తున్న వారి విషయంలో ఉపేక్షించే ప్రసక్తేలేదని, రీచ్‌ల వద్ద అడ్డుకునే సొసైటీల గుర్తింపులు రద్దుచేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్‌రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి సంపత్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షులు రావూరి రాజా, శ్రీనివాస్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

బిక్కవోలు/రాజానగరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య స్వగ్రామమైన కొంకుదురు, రాజానగరంలోని శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14నుంచి 20వరకూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారులు ఎస్.బాల, కలగర సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ నెల 14న వారోత్సవాల ప్రారంభం, బాలల దినోత్సవం, 15న డ్రగ్స్‌పై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖుల విశేషాలు వివరించడం, 17న రచయితల సందేశాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు, వ్యాసరచన, చిత్రలేఖనం, 18న విద్యార్థులకు వక్తృత్వం, డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్, క్రీడలపై పోటీలు, దేశభక్తి గీతాలు, సుమతీ,వేమన శతకాల నుంచి పద్యాలు 19న మహిళా దినోత్సవం సందర్భంగా దిశ చట్టం, మహిళా సాధికారతపై చర్చ, పర్యావరణ పరిరక్షణపై వక్తృత్వ పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయాలు, చదువు అంటే మాకిష్టంపై పాఠకులు, ప్రజలు, విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు, అక్షరాస్యతా దినోత్సవం, పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారులు తెలిపారు. 15 నుంచి 20 వరకూ ప్రతి రోజూ పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు.

కాపునాడు నియోజకవర్గాల వారీ అధ్యక్షులు


నియామకపత్రాలు అందుకుంటున్న అధ్యక్షులు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాపునాడుకు నియోజకవర్గాల నూతన అధ్యక్షులను నియమించినట్టు సంఘ పార్లమెంట్ అధ్యక్షుడు గుదే రఘు నరేష్ తెలిపారు. దేవిచౌక్ కాపునాడు కార్యాలయంలో మంగళవారం రాజమహేంద్రవరం, రూరల్, రాజానగరం నియోజకవర్గాల కాపునాడు అధ్యక్షులకు నియామక పత్రాలు అందించారు.రాజమహేంద్రవరం అర్బన్ అధ్యక్షుడిగా విన్నా వాసు, రూరల్ అధ్యక్షుడిగా దేశినీడి రాంబాబు, రాజానగరం అధ్యక్షుడిగా కాళ్ల చక్రరావులను నియమించారు. ఈ నెల 24న దివాన్‌చెరువు సమీపంలో జరిగే కాపునాడు వనసమారాధన విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముమ్మిడి వీరబాబు, ర్యాలీ రామకృష్ణ, ఉర్రింకల సతీష్, పిల్లా దుర్గాప్రసాద్, పసలపూడి లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

బోధన నాణ్యతను మెరుగుపర్చుకోవాలి


పి. భూపతిరాజు

రాజానగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, యూఎస్ఏ, ఫౌండర్ అండ్ చైర్మన్ భూపతిరాజు పండేటి పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులతో ప్రత్యేక బోధనా పద్ధతులు అనే అంశంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా విజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారని, శాస్త్ర జ్ఞానాలను బోధించడానికి అధ్యాపకులు అంగీకరించి, వారి పరిజ్ఞానానికి తగినట్టుగా పెంచుకోవాలన్నారు. ప్రతి రోజు కొత్త విషయాలు నేర్చుకోవడం ద్వారా బోధన నాణ్యతను మెరుగుపర్చుకోవాలన్నారు. సమావేశంలో జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, ఎంవీఎస్ బాబు, ఎండీ ధనరాజు, పీజీ రామానుజం, కె.వల్లీమాధవి పాల్గొన్నారు.

నల్లజర్లలో శిక్షణకు ఎన్‌సీసీ కేడెట్లు


ఏకేఆర్‌జీ కళాశాలకు చేరుకున్న వివిధ జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్‌లు

నల్లజర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌లకు నల్లజర్ల ఏకేఆర్‌జీ ప్రాంగణంలో బుధవారం నుంచి ఈనెల 21వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు 19 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే పేర్కొన్నారు. మూడు జిల్లా నుంచి 12 కళాశాలు, 23 పాఠశాలలకు చెందిన 664మంది విద్యార్థులు మంగళవారం నల్లజర్ల వచ్చి పేర్లు నమోదు చేయించుకున్నారు. 2026 ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు 3జిల్లాల నుంచి క్యాడెట్ల ప్రాబబుల్స్‌ను ఎంపిక చేయడంతోపాటు, వివిధ రకాల శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది జరుగనున్న రిపబ్లిక్ పరేడ్‌కు ఉమ్మడిజిల్లా నుంచి ఆరుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపికయ్యారని, వీరికి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

చక్రద్వారబంధంలో ఉద్రిక్తత

అక్రమ మోటార్లు తొలగింపు.. అడ్డుకున్న గ్రామస్థులు ..వెనుతిరిగిన అధికారులు

రాజానగరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామస్తులను తాగునీటి ఇక్కట్లను గట్టెక్కించే దిశగా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. "నీళ్లు కావాలంటే పని మానుకోవాల్సిందే" శీర్షికన ఈ నెల 7న ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తక్షణమే స్పందించిన విషయం పాఠకులకు విధితమే. గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ప్లంబర్లతో కూడిన 10బృందాలను ఏర్పాటు చేసి మంగళవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి కుళాయిలకు అక్రమంగా అమర్చిన మోటారు కనెక్షన్లను తొలగించే పనులకు ఉపక్రమించారు.దీంతో గ్రామస్తులు సంబంధిత అధికారులపై తిరుగుబాటు చేయడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పోలీసులు రంగప్రవేశం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో జేఏ ఝాన్సీ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఏఈ అవినాష్, ఈవోపీఆర్డీ వాణి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బృందాలతో కలిసి గ్రామస్తుల సమక్షంలో చర్చించారు. ప్రజలందరికి పూర్తిస్థాయిలో తాగునీటిని అందించడంలో భాగంగా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు అక్రమ మోటార్లు తొలగించే పనులు చేపట్టినట్టుగా అధికారులు బదులిచ్చారు. మోటార్లు తొలగించవద్దు, మాకు పూర్తిస్థాయిలో నీళ్లు సరఫరా చేసిన తర్వాతనే తొలగించాలని గ్రామస్తులంతా అధికారులకు విన్నవించారు. దీంతో అక్రమ మోటార్లు తొలగించే పనులను నిలిపివేశారు. తొలగించిన మోటార్లను సంబంధిత యజమానులకు తిరిగి చ్చేశారు. ప్రస్తుతానికి గ్రామంలో ఉన్న మూడు బోర్లను అనుసంధానం చేసి, ప్రజలందరికీ పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్టు ఎంపీడీవో తెలిపారు. గ్రామానికి సరఫరా అవుతున్న గోదావరి జలాల సరఫరాను రెట్టింపు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్టు ఏఈ అవినాష్ వివరించారు.

19న ప్రభుత్వ మద్యం షాపుల్లోని వస్తువుల వేలం

చాగల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌బీసీఎల్ చాగల్లు డిపో పరిధిలోని 117 ప్రభుత్వ మద్యం షాపుల నుంచి తీసుకువచ్చిన వస్తువులకు ఈ నెల 19న వేలం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ ఎం.రామకృష్ణదాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించినప్పుడు ఉపయోగించిన ఫ్రీజర్, ఇన్వర్టర్ బ్యాటరీ, క్యాష్ చెస్ట్, స్కానర్, క్యాష్ కౌంటింగ్ మిషన్‌లను వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనదలిచినవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి, ప్రభుత్వ గుర్తింపుకార్డు నకలు సమర్పించాలని, పాడుకున్న వస్తువు ధర మొత్తం వెంటనే 18శాతం జీఎస్టీతో చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం 96767 14547 లేదా 99493 51050 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యుమోనియాపై అవగాహన అవసరం

ప్రపంచ న్యుమోనియా దినోత్సవంలో ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు శ్రీనివాసరెడ్డి


సీతానగరంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్12 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం జూపిటర్ ఆసుపత్రి ఆవరణలో కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యుమోనియా వ్యాధి కారణంగా గాలి గదుల్లో వాపు ఏర్పడి ఊపిరి ఆడకపోవడం, దగ్గు, జ్వరం, ఊపిరితిత్తుల్లో నొప్పి,చలి, అలసట వంటివి కనిపిస్తాయన్నారు. డాక్టర్ కర్రి లావణ్య, డాక్టర్ ఎం.దుర్గాప్రసాద్ నూతన వైద్య విధానాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీని వాసరావు, కార్యదర్శి పిదేవానందం, అధ్యక్షుడు రహమాన్, కార్యదర్శి ఎం.రమేష్, యు.ప్రసాద్, ఆసుపత్రి డైరెక్టర్ ఎల్.ఈశ్వర్,జ్యోతి స్వరూప్ పాల్గొన్నారు.

న్యుమోనియాతో జాగ్రత్తగా ఉండాలి

సీతానగరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీతానగరంలో న్యుమోనియా వ్యాధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ ఏసురాణి మాట్లాడారు. ఈ వ్యాధితో ఐదేళ్లలోపు, 60 ఏళ్లు పైబడిన వారికి ఎక్కువ ప్రమాదం ఉంటుదన్నారు. పిల్లల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ముక్కు నుంచి ద్రవాలు కారడం, ఎడతెరిపి లేని దగ్గు, శ్వాస తీసుకున్నప్పుడు డొక్కలు ఎగురవేయడం, తీవ్ర జ్వరం, శరీరం నీలిరంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్ళాలని సూచించారు.పిల్లలను చలిగాలి, దుమ్ము, పొగ కూటైన రసాయనాల వాసనలకు దూరంగా ఉంచాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్‌ఎన్ ఆదిలక్ష్మీ, సూపర్వైజర్లు సుధాకర్, దైవకృప, ఏఎన్‌ఎంలు వరలక్ష్మీ, మంగ, షేక్ మున్నీసా, షేక షమీమా పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లకు ఉర్జా వీర్ పథకం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశ పెట్టిన ఉర్జావీర్ పథకంపై ప్రతి ఎలక్ట్రీషియన్ అవగాహన కలిగి ఉండాలని ఎలక్ట్రికల్ డీఈ సౌజన్య అన్నారు. రాజమహేంద్రవరం ఈస్టర్న్ పవర్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో మంగళవారం గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఎలక్ట్రికల్ సోదరుడు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎలక్ట్రీషియన్ ఈ పథకంలో చేరేందుకు అర్హుడన్నారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డు తీసుకోని యూనియన్ నాయకులను సంప్రదించాలన్నారు. సమావేశంలో ఈసీఎల్ బ్రహ్మానాయుడు, వెంకటరమణ, వెంకట్రావు, ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు కాశీ, బొజ్జ రామకృష్ణ, కాకి రవిబాబు పాల్గొన్నారు.

అక్కినను కలిసిన కర్ణాటక కమ్మసంఘం


టీటీడీ డైరెక్టర్ అక్కిన సత్కరిస్తున్న అఖిల కర్ణాటక కమ్మసంఘ అధ్యక్షుడు రామకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలక మండలి డైరెక్టర్ అక్కిన మునికోటేశ్వరరావును అఖిల కర్ణాటక కమ్మసంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరంలోని మునికోటేశ్వర రావు నివాసంలో సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, గారపాటి విశ్వనాథం, ఆళ్ల బాబి సత్కరించారు.

కరాటే పోటీల్లో చందుబాబుకు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న చందుబాబు

అనపర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన దొడ్డే చందుబాబు బ్లూ బెల్ట్ విభాగంలో స్వర్ణ పతకం సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అతడిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, శివరామకృష్ణంరాజు, అభినందించారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఉండ్రాజవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాల్దరిలో జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు మంత్రి కందుల దుర్గేష్ తక్షణ సహాయంగా జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ ద్వారా మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

భక్తిశ్రద్ధలతో ప్రభోదిని ఏకాదశి పూజలు


అలంకార రూపంలో లక్ష్మీనారాయణులు


అలంకార రూపంలో కుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని వైష్ణాలయాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రభోదిని ఏకాదశి పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో వచ్చే ఏకాదశిని ప్రభోదిని, ఉత్థాన ఏకాదశి అంటారు. బిక్కవోలులోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. లక్ష్మీనారాయణులకు లక్ష తులసి పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే బిక్కవోలులోని ప్రాచీన కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని రజ, కుజ, సర్ప, కాల దోష నివారణార్థం వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు.

సాయిబాబాకు బీవీఆర్ చౌదరి క్షీరాభిషేకం


సాయిబాబాకు పూజలు చేస్తున్న రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

కోరుకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం బూరుగుపూడి ద్వారకా షిర్డి సాయిబాబాకు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి 108లీటర్ల పాలతో ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారికి సహస్ర తులసీదళ అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగ కేశవరావు, గురుదేవులు మామిడిపల్లి రామారావు, బీవీవీ సత్యనారాయణ, గూడపాటి వెంకటేశ్వరరావు, మోతిన శివమోహన్, కంటే గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న డాక్టర్ రామగుర్రెడ్డి దంపతులు

అనపర్తి నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ ఘనంగా నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి లక్ష్మీ లలితారాణి దంపతులు కళ్యాణకర్తలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా ఇటీవల ఫెలోషిప్ ఆఫ్ కామన్ వెల్త్ మెడికల్ అసోసియేషన్ అవార్డు అందుకున్న గుర్రెడ్డి దంపతులను ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

» ఆర్ట్స్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం టీచర్ ఎమ్మెల్సీఎన్నికలకు సంబంధించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ తరలించేందుకు నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. డిసెంబరు 5వ తేదీ ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలో మొత్తం 20 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి మండలంలో ఒక్కొక్కటి చొప్పున, రాజమహేంద్రవరంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ సిబ్బంది ఆర్ట్స్ కళాశాల నుంచి డిసెంబరు 4న పోలింగ్ మెటీరియల్‌తో బయలుదేరి వారికి కేటాయించిన కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట డీఆర్వో టి.శ్రీరామ చంద్రమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ ఉన్నారు.

అల్పపీడనంతో రైతుల్లో ఆందోళన


గౌరీపట్నం హైవే సర్వీస్‌రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం

దేవరపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో వాతావరణ మార్పులు వచ్చి మబ్బులుగా ఉండటంతో ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం రోడ్లపై ఆరబెట్టడం, కుప్పలుగా పెట్టడం జరిగింది. కొంతమంది రైతులు వాతావరణ మార్పులవలన బస్తాల్లో లోడుచేసి సురక్షితంగా ఇళ్లకు తరలిస్తున్నారు. పొలాల్లో పోసిన ధాన్యాన్ని జాతీయరహదారి పొడుగునా గౌరీపట్నం, దుద్దుకూరు, యర్నగూడెం గ్రామాల్లో ధాన్యాన్ని ఆరబెట్టి ఉంచారు. వర్షంపడితే ధాన్యం రంగు మారి కొనే పరిస్థితులు ఉండవని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతులు బరకాలు కప్పుతున్నారు.

వీధి కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయండి

డాక్టర్ అనుసూరి పద్మలత వినతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వీధి కుక్కలను నియంత్రించేందుకు వాటికి బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు తప్పనిసరిగా చేయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత సూచించారు. ఈ మేరకు కమిషనర్ కేతన్ గార్గ్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. కుక్కలను వ్యాక్సిన్‌తో పాటు బర్త్‌కంట్రోల్ ఆపరేషన్ తప్పక చేయించాలన్నారు.

రాష్ట్ర డీజీపీకి స్టేట్ ఆటో ఫైనాన్షియర్స్ వినతి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ వద్ద ఫైనాన్స్ చేయించుకున్న కొంత మంది బయట వాహనాలు తనఖా పెట్టడం వల్ల తామంతా నష్టపోతున్నామని స్టేట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీని కలిసి వినతిపత్రం అందించినట్టు మంగళవారం స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లేపు మంగరాజు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో కృష్ణుడు, లోవరాజు, ఫణిమోహన్, కందుల వెంకటరెడ్డి, మధు, జూలకంటి సురేష్, కృష్ణప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శెట్టి బలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా మంగరాజు



గోకవరం, నవంబరు12(ఆంధ్ర జ్యోతి): శెట్టి బలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బీజేపీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో భాగంగా మంగరాజుకు ఈ పదవి లభించింది. మండలంలోని ఇటికాయిపల్లి పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన మంగరాజు గతంలో బీజేపీ మండలాధ్యక్షుడిగా, టెలికమ్యూనికేషన్ అడ్వైజరీ బోర్డు మెంబరుగా, యువమోర్చ జిల్లా అధ్యక్షుడిగా పదవులు చేపట్టారు. మంగరాజు నియామకం పట్ల విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, పలువురు కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

సీతానగరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి ఈ కార్యక్రమంలో మహిళలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. చిన్న వృత్తులలో ఉన్న మహిళలకు ఈ విధాన్‌సె సమాధాన్ కార్యక్రమం అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాలు తదితర సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో సీడీపీవో జె.ఝాన్సీరాణి, అడ్వొకేట్ వి.సుజాత, ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాసు, డీసీపీవో రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్,యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు కాకినాడ రెడ్‌క్రాస్ సంస్థకు 108 యూనిట్లు రక్తదానం చేశారు. బీసీ రాయ్ అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గంగిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్‌కోఆర్డినేటర్స్ నాగేశ్వరరావు,బిహెచ్‌రమాదేవి,కెమహేశ్వరి,పి సాయి పాల్గొన్నారు.

నేడు నరసింహస్వామి తెప్పోత్సవం

కోరుకొండ,నవంబరు12(ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా బుధవారం రాత్రి 7 గంటలకు చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య తెప్పోత్సవం నిర్వహించనున్నారు. దేవుడి కోనేటి వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు దేవస్థానం ఛైర్మన్ పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. తెప్పోత్సవంపై స్వామివారితో పాటు 15 మందికి మించి ఉండరాదని ఎస్‌ఐ,అధికారులు పేర్కొన్నారు.



దేదీప్యమానంగా..నరసన్న కొండ

కోరుకొండ,నవంబరు12(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా మెట్ల దీపోత్సవం నిర్వహించారు. కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కొండ మెట్లపై మహి ళలు పెద్ద ఎత్తున దీపాలు వెలగించారు. దీపాలు వెలిగించేందుకు మహిళలు పోటీపడ్డారు. దీంతో కొండంతా దేదీప్యమానంగా కనిపించింది. చీకటి మధ్య ఎర్రని కాంతులతో నిండిపోయింది. ముందుగా స్వామివారి పాదాల వద్ద అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేయించి దీపాలు వెలిగించి మెట్ల దీపోత్సవం ప్రారంభించారు.అనంతరం స్వామి వారి కొండచుట్టూ పాదాల చుట్టూ 650 మెట్లకు ఇరువైపులా కార్తీక దీపాలను వెలిగించారు. అచ్యుతాపురం గ్రామానికి చెందిన శంఖ రామకృష్ణ, సీతామహాలక్ష్మి కుటుంబ సభ్యులు స్వామివారిమెట్ల దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులందరికీ కార్తీక అన్నసమారాధన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక స్వాములు బీజేపీ, జనసేన,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



సాగునీటి సలహా మండలి సమావేశంలో ఇరిగేషన్ అధికారులపై మండిపడుతున్న కలెక్టర్

కూటమి.. రి..యాక్షన్!



సోషల్ మీడియా పోస్టులపై ఉక్కుపాదం

- నాడు ఇష్టానుసారం పోస్ట్‌లు
- నేడు 11 కేసులు నమోదు
- మాజీ ఎంపీ, పోసానిపైనా కేసు
- ముగ్గురి అరెస్టు..ఇద్దరికి రిమాండ్
- పలువురి కోసం దర్యాప్తు
- సోషల్ మీడియాపై నిఘా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో ఇష్టానుసారం పోస్టులు.. ఎవరికి తోచినట్టు వారు పెట్టడమే.. పార్టీపై అభిమానమో.. జగన్ పదవి ఇస్తారని వ్యామోహమో తెలియదు.. సోషల్ మీడియాను తమ ఇష్టానుసారం వాడేశారు.. రకరకాల కామెంట్లతో పిచ్చెక్కించారు.. ప్రస్తుతం కేసులతో అల్లాడుతున్నారు. చేసినతప్పుకు ఏనాటికైనా శిక్ష తప్పదనే నానుడి ఈ సంఘటనకు అతికినట్టు సరిపోతుంది. కూటమి పెద్దల సహనాన్ని పరీక్షిస్తున్న వైసీపీ నాయకులకు గట్టిగా బుద్ధి చెప్ప డానికి ప్రభుత్వం నిర్ణయించింది.దీంతో ఇప్పటి వరకూ మిన్నకున్న పోలీసులు రంగంలోకి దిగారు.ఇటీవల ఐజీ అశోక్ కుమార్ ఆదేశాలతో కేసులు పెట్టడం ఆరంభించారు. పోస్టుపై ఫిర్యా దు అందితే వెంటనే ఎఫ్ఐఆర్ వేసి చర్య లకు ఉపక్రమిస్తున్నారు.2022లో పోసాని కృష్ణమురళి అసభ్యకర పదజాలంతో ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రెచ్చిపోయారు. దీంతో అప్పట్లో జనసేన నాయకులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం కావడంతో పోలీసులు చేతులు కట్టేసుకున్నారు.

ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసులు నమోదు చేస్తున్నారు. ఒక కేసులో పోసానిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి జనసేన నాయకులు మరోమారు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేశారు. దానిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇలా ఒక్కో కేసు బయటకు లాగుతున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ మూకలు టీడీపీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ తదితరులపై చెత్త పోస్టులతో చెలరేగిపోయాయి. ఫేస్‌బుక్, వాట్సాప్,ఎక్స్, ఇన్‌స్టా.. ఇలా అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా వ్యక్తిగత విషయాల్లోనూ తలదూర్చి ఇంట్లో వాళ్లపైనా సిగ్గు తలదించుకొనే విధంగా పోస్టులు పెట్టారు.మార్పు కోసం నాలుగు నెలలు సమయం ఇచ్చిన సీఎం చంద్రబాబు..ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వస్తున్న ఫిర్యాదులతో యాక్షన్‌లోకి దిగక తప్పలేదు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని సైబర్ సెల్ నిరంతరాయంగా అసభ్యకర పోస్టులపై నిఘా పెట్టింది. సోషల్ మీడియాలో సభ్య సమాజం సిగ్గు పడే విధంగా వైసీపీ సైకోలు పోస్టులు పెడు తున్నా ఫిర్యాదు చేయడానికి చాలా మంది వెనుకాడుతున్నారని తెలుస్తోంది.జిల్లా స్థాయిలో ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో ఒక వాట్సాప్, టెలి గ్రాం నెంబరు ఏర్పాటు చేసి ఫిర్యాదు, సాక్ష్యాలు పంపాలని ప్రకటిస్తే మరింత ఉప యోగకరంగా ఉంటుంది. వాటి ఆధారంగా చర్యలకు ఉపక్ర మిస్తే సైకోలు అదుపులోకి అవకాశం ఉంది.

రెచ్చిపోతే వదిలిపెట్టం



సోషల్ మీడియాలో అసభ్యకర, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్న వారిపై గట్టి నిఘా పెట్టాం. వాటిని ఫార్వర్డ్ చేసినా నేరమే. ఇప్పటికే కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నాం. కొందరికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. సోషల్ మీడియాలో బాధ్యతతో వ్యవహరించాలి. లేనిపక్షంలో కేసులు ఎదుర్కోక తప్పదు. ఏదేమైనా రెచ్చిపోతే ఎవరైనా వదిలిపెట్టమని హెచ్చరిస్తున్నాం.- **నరసింహ కిషోర్, ఎస్పీ**

11 కేసులు.. ముగ్గురి అరెస్ట్

సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, నారా బ్రాహ్మణి, ప్రధాని మోదీ,ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజుపై అసభ్యకర పోస్టులు పెట్టడంపై కేసులు నమోదు చేశారు.ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రాజకీయ, రాజకీయేతర, వ్యక్తిగత, వివిధ సంఘాల సోషల్ మీడియా అడ్మిన్లకు పోలీసులు 610 వరకూ నోటీసులు ఇచ్చారు. 11 కేసులు నమోదు చేయగా ముగ్గురిని అరెస్టు చేశారు.రంగంపేటకు చెందిన వీరా బత్తుల చంద్రశేఖర్‌కు చందు వైఎస్ఆర్‌సీపీ పేరిట ఒక ఫేస్ బుక్ ఐడీ, చంద్రశేఖర్ 7799(ఇన్‌స్టా) ఉన్నాయి.వీటి ద్వారా పలు పోస్టులు పెట్టాడు.ఇతన్ని ఇటీవల గోపాలపురంలో అరెస్టు చేశారు.. స్టేషన్ బెయిల్‌పై విడుదలయ్యాడు. మార్గాని భరత్ అఫీషియల్ (ఇన్‌స్టా) పేరిట మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ రకరకాల పోస్టులు పెట్టడంపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది..ఇతన్ని అరెస్టు చేయాల్సి ఉంది.చూడచక్కని హెరిటేజ్ పాలు పేరిట ఒక గుర్తుతెలియని వ్యక్తి పేరిట ఫేస్ బుక్ ఐడీ ఉంది..ఇతనిపై కడియంలో కేసు లు నమోదయ్యాయి. ఇంటూరి రవికిరణ్ పేరున ఒక ఫేస్ బుక్ ఐడీ ఉంది.ఇతనిపై ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పులి సాగర్ 1995 పేరిట గుర్తు తెలియని వ్యక్తి ఫేస్‌బుక్ అకౌంట్ ఉంది.ఇతనిపై కూడా ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. కేవీఆర్ రాజు పేరిట ఫేస్ బుక్ ఐడీ కొంతం వెంకట రమణ రాజు పేరున ఉంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. హరీస్ వార్ రెడ్డి ఫేస్ బుక్ ఐడీని గుర్తు తెలియని వ్యక్తి కొన సాగించిన వ్యక్తిపై ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఫేస్‌బుక్ ఐడీ పేరిట కామెంట్స్ పెట్టిన రావూరి రవితేజపై బొమ్మూరు స్టేషన్‌లో కేసు నమోదైంది. హరికృష్ణారెడ్డి. కల్లాం.90 పేరిట కె.హరికృష్ణారెడ్డి ఫేస్ అకౌంట్ నుంచి కామెంట్స్ చేయడంపై ప్రకాశంనగర్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫేస్‌బుక్ ఐడీ పేరిట మేకా వెంకట రామిరెడ్డిచేసిన కామెంట్స్‌పై రాజానగరం స్టేషన్‌లో కేసు నమోదు కాగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంకా ఆయా సోషల్ మీడియా ఐడీలను బ్లాక్ చేయక పోవడం గమనార్హం.పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంతో సైబర్ సైకోలు రెచ్చి పోతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

గోదావరి నీటి సరఫరాపై కంటితుడుపు నివేదికలు వద్దు

- ఇరిగేషన్ అంటే కేవలం సాగునీటి కోసం కాదు
- అధికారుల అసంపూర్తి నివేదికపై కలెక్టర్ ఆగ్రహం
- వచ్చే సమావేశానికి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలి
- వాడివేడిగా సాగునీటి సలహా మండలి సమావేశం

రాజమహేంద్రవరం,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ అధికారులపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సాగునీటి సలహామండలి సమావేశానికి అరకొర వివరాలతో వచ్చిన ఇరిగేషన్ అధికారులకు ఆమె క్లాస్ తీసుకున్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సా యంత్రం రబీ సీజన్ ఏర్పాట్లకు నిర్వహించిన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమా వేశాన్ని అసంపూర్తిగా వాయిదా వేశారు. డిసెంబరు 1 నుంచి రబీ సీజన్ మొదలు పెట్టడానికి ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు,ఈఈ కాశీ విశ్వేశ్వ రరావు, పలువురు డీఈఈలు ఒక నివేదికతో హాజర య్యారు.ఇరిగేషన్ అధికారులు తెచ్చిన నోట్ చదివిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో డెల్టాల పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఎన్ని హెక్టార్ల ఆయకట్టు ఉంది.అక్కడ నీరు ఎంత అవసరం.ప్రస్తుతం గోదావరిలో నీరెంత. రబీకి ఎంత అవసరం.తక్కువ వస్తే ఏమి చేయాలని అనే ప్రశ్నలు సంధించారు. నీరు ఉందని చెబుతారు. ప్రతి ఏటా రైతులు ఎందుకు ఇబ్బంది పడుతున్నారు.తమ పొలాలు ఎండిపోయాయని ఎందుకు చెబుతుంటారు. మరి ఈ నివేదికలో ఇవేమీ ఎం దుకు ఉండవని ఆమె నిలదీశారు. గోదావరిలో నీరు సముద్రంలోకి పోతుంటుంది. ఎత్తి పోతల పథకాలకు, పరిశ్రమలకు సరిపడా నీరివ్వొచ్చుకదా, గోకవరం మండలంలో భూ గర్భ జలాలు తగ్గిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు.గోదావరి ప్రక్కనే ఉన్న రాజమహేంద్రవరానికి పూర్తిగా మంచినీళ్లివ్వలేని పరిస్థితి ఉంది. కొవ్వూరు, నిడదవోలు వంటి ప్రాంతాలకు ఇంకా బోరు నీరే ఆధారం. అక్కడకు మంచినీళ్లు ఇవ్వడానికి ఎం దుకు ఆలోచించరని అన్నారు. ఇక కంటితుడుపు నివేదికలు వద్దని క్లాస్ తీసుకున్నారు. తూర్పుడెల్టా ప్రాంతంలోని కడియం, బిక్కవోలు, అనపర్తి మండలాలు, పశ్చిమ డెల్టా పరిధిలోని కొవ్వూరు కొంతభాగం, నిడదవోలు, పెరవలి మండలాల్లో ఎంత ఆయకట్టు ఉంది. గతేడాది ఏ సమస్య వచ్చింది. దానిని ఎలా అధిగమించాలని,మొత్తం నీరు ఎంత అవసరం అనే నివే దికలు సిద్ధం చేయాలన్నారు. పశ్చిమ డెల్టా ప్రాంత డీఈఈ గైర్హా జర్‌పై మండిపడ్డారు. రానున్న సమావేశానికి సమన్వయ శాఖల అధికారులతో పాటు సం బంధిత ఇరిగేషన్ అధికారులు పూర్తి నివే దికతో హాజరుకావాలన్నారు.సాగునీటిపై మండల వ్యవసాయ అధికారులు నివేదిక తయారు చేయాలన్నారు. వ్యవసాయ అను బంధ శాఖలు,నీటి సరఫరా, మునిసిపల్ ,ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు,మంచినీటి అవసరాలు, పరిశ్రమల నీటి అవసరాలతో కూడిన నివేదిక అందించాలన్నారు. ఎర్రకాలువ, కొవ్వాడ, చింతలపూడి, తొర్రిగడ్డ ప్రాజెక్టుల ఏఈలు ఆయా ప్రాజెక్టుల పరిధిలోని సీజన్‌వారీగా సాగు విస్తీర్ణం, సాగునీటి అందించడంలో సమస్యలపై నివేదిక అందించాలన్నారు.ఇరిగేషన్ సమావేశానికి కొంతమంది అధికారులే హాజరవడం.. ఇరిగేషన్ అధికారులు తయారు చేసి నోట్‌లో సరైన వివ రాలు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాన్ని వాయిదా వేసి.. పూర్తి వివరాలతో మరోసారి రావాలని పంపించేశారు. సమావేశంలో కొవ్వూరు ఆర్డీఓ రాణి సుష్మిత, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఇరిగేషన్ ఈఈ కాశి విశ్వేశ్వరావు, సీపీఎ ఎల్. అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ ఆఫీస్‌లో విచారణ

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం లోని జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయంలో ఏడాదిన్నరగా సాగుతున్న రగడపై మంగళవారం విచారణ జరిగింది. విజ యవాడ హెడ్ ఆఫీసుకు చెందిన ఆడిట్ జాయింట్ డైరెక్టర్ కనకదుర్గ సుమారు 11.30 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విచారణ జరిపారు. జిల్లా ఆడిట్ అధికారిణి పద్మజారాణికి అక్కడ పనిచేస్తున్న అసిస్టెంట్ ఆడిట్ అధికారులు, సీనియర్ ఆడిట్ అధికారుల మధ్య వివాదాలను ఇటీవల ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. జిల్లా ఆడిట్ అధికారి సుమారు 300 పేజీలపైగా ఆడిట్ రిపోర్టులు. , కొం దరు ఆడిటర్లు పంచాయతీలకు వెళ్లి ఆడిట్ చేయకుండా ఇచ్చిన నివేదికలపై రిపోర్టు అందజేసినట్టు సమాచారం. ఇక అసిస్టెంట్ ఆడిట్ అధికారులు, సీనియర్, జూనియర్ అధికారులు సుమారు 12 మంది తమ ఫిర్యాదును రాత పూర్వకంగా అందించినట్టు సమాచారం. విచారణ అధికారి కనకదుర్గ ఒక్కో అధికారిని ప్రత్యేకంగా పిలిచి వారి అభిప్రాయాలు వినడంతో పాటు రాతపూరకంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఎంక్వయిరీ రిపోర్టులను ఉన్నతాధికారులకు ఇస్తానని చెప్పి విచారణ అధికారి వెళ్లిపోయారు.

డ్రంకెన్ డ్రైవ్.. రూ.1.60 లక్షల జరిమానా

16 మందికి రూ.10 వేల చొప్పున

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లోని 16 మందికి కోర్టు రూ.10 వేల చొప్పున రూ.1.60 లక్షల జరిమానా విధించిందని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో ఇప్పటి వరకూ 381 కేసులు నమోదు చేశామన్నారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌పై నిరంతర తనిఖీలు చేస్తున్నామని ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించడం ప్రమాదమన్నారు.

ఇసుక.. రచ్చ రచ్చ



తీపర్రు ర్యాంపులో ఉచిత ఇసుక ట్రాక్టర్ల క్యూ

ఇసుక విధానం గందరగోళం చేశారు

జిల్లా ఎమ్మెల్యేలపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తి

రాజమహేంద్రవరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉచిత ఇసుక అమలు విధానంలో సమస్యలపై సీఎం చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.అమరావతిలో మంగళవారం ఆయన టీడీపీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో జిల్లాల వారీ సమీక్షించినపుడు తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక విధానాన్ని ధ్వంసంచేసినట్టు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ఉచిత ఇసుక విధానంలో ఇద్దరు ఎమ్మెల్యేల వైఖరి అసలు బాగాలేదు. ఇసుకవిధానాన్ని ధ్వంసం చేశారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.ఎవరా ఎమ్మెల్యేలు అనేది జిల్లాలో పెద్ద చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఇసుక నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉన్న సంగతి తెలిసిందే. ఇద్దరు ఎవరనే దానిపై జిల్లాలో చర్చ సాగుతోంది.

తీపర్రులో ఇసుక వివాదం

- ఉచిత ఇసుకపై గందరగోళం
- ఇవ్వలేమన్న కాంట్రాక్టర్
- వేరే ర్యాంపులో తవ్వకాలు
- దారివ్వకుండా ట్రాక్టర్ల అడ్డగింత
- సర్దుబాటు చేసిన తహశీల్దార్
- తీపర్రులో పశ్చిమ డిప్యూటీ కలెక్టర్
- ఇసుక ఇవ్వాలని ఆదేశాలు

పెరవలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక విధానం వివాదాలకు దారితీస్తోంది. ప్రభుత్వం ఆదాయం కోసం ఆలోచించకుండా ఉచిత ఇసుకకు అవకాశమిస్తే అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు..దీంతో అటు కాంట్రాక్టర్లు.. ఇటు ఉచిత ఇసుక ట్రాక్టర్ల యజమానుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. తాజాగా కోనసీమ జిల్లా రావులపాలెంలో ఇటీవల వివాదం తలెత్తగా అధికారులు సర్దుబాటు చేశారు. ప్రస్తుతం అటువంటి వివాదమే పెరవలి మండలం తీపర్రులోనూ నెలకొంది. తీపర్రులో కాంట్రాక్టర్ తీసుకున్న ర్యాంప్ నుంచి గోదావరిలో ఇసుకను మంగళవారం ఉదయం ట్రాక్టర్లపై స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు.ఇదిలా ఉండగా ఆయా గ్రామాల నుంచి సుమారు 30 నుంచి 40 ట్రాక్టర్ల వరకు ఉచిత ఇసుక తీసుకు వెళ్లేందుకు ర్యాంపునకు వచ్చాయి. ట్రాక్టర్లకు ఇసుక ఎగుమతి చేయడానికి కాంట్రాక్టర్, బంటా కార్మికులు నిరాకరించినట్టు సమాచారం. దీంతో ఆ పక్కనే ఉన్న మరొక ర్యాంప్ నుంచి ఉచిత ఇసుక ఉచితంగా తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ యజమానులు సిద్ధమయ్యారు. ఉసులుమర్రు వైపు గల ఈ ర్యాంప్‌లో సుమారు 20 ట్రాక్టర్ల వరకు ఇసుకను ఎగుమతి చేస్తున్నారు.కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన ర్యాంప్ నుంచి దిగిన ట్రాక్టర్లు వేరొక ర్యాంప్ ద్వారా పైకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే తమ ర్యాంప్ నుంచి ట్రాక్టర్లు కిందకు దిగడానికి వీల్లేదని ఇసుక కాంట్రాక్టు పొందిన వ్యక్తులు అక్కడ బాటకు అడ్డంగా మట్టి పోశారు. దీంతో వివాదం పెద్దదైంది.. ఇరువర్గాలు మాటామాటా అనుకున్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో తహశీల్దార్ అచ్యుతకుమారి సంఘటనా స్థలానికి చేరుకుని అనుమతి పొందిన ర్యాంప్‌లో మాత్రమే ఉచిత ఇసుక తీసుకోవాలని వేరొక ర్యాంప్ ద్వారా ఇసుక తీసుకెళ్లడం కుదరదని పేర్కొన్నారు. దీంతో ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు తమకు ఆ ర్యాంప్ నుంచి ఉచిత ఇసుక ఎగుమతి చేయకపోవడం వల్లే వేరొక ర్యాంప్ నుంచి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.దీనిపై స్పందించిన తహశీల్దార్ గోదావరిలో ఇసుక ఏ ప్రాంతంలో ఏ మేరకు తీయాలనేది గనుల శాఖ అధికారులు నిర్ణయించారని అం దువల్ల అక్కడ మాత్ర మే ఇసుక తీయాలని చెప్పారు. తమకు ఆ కాంట్రాక్టర్ ఉచిత ఇసుక ఎగుమతి చేస్తే తమకు అభ్యంతరం లేదని ట్రాక్టర్ యజమానులు పేర్కొన్నారు.దీంతో త హశీల్దార్ ఆ కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఉచిత ఇసుక ఎగుమతి అయ్యేలా చూడాలని సూచించారు.



పశ్చిమకు ఇసుక సరఫరాపై తహశీల్దార్‌ను ప్రశ్నిస్తున్న డిప్యూటీ కలెక్టర్

పశ్చిమకూ ఇసుక ఇవ్వండి

డిప్యూటీ కలెక్టర్ కతీఫ్ కౌసర్ భాను

పెరవలి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): తీపర్రు ఇసుక ర్యాంప్‌లో పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన లారీలకు ఇసుక ఎందుకు ఎగు మతి చేయడం లేదంటూ తాడేపల్లిగూడెం డిప్యూటీ కలెక్టర్ కతీఫ్ కౌసర్ భాను ప్రశ్నించారు. తీపర్రు ఇసుక ర్యాంప్‌ను మంగళవారం పరిశీలించారు. ర్యాంపు నిర్వాహకులపై మండిపడ్డారు.ఇక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన లారీలకు ఇసుక ఎగుమతులు జరగాల్సి ఉన్నప్పటికి ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. దీంతో లారీలకు ఎగుమతి చేయడానికి తగినంత స్టాక్ లేకపోవడం వల్ల గోదావరి నుంచి స్టాక్ పాయింట్‌కు ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తున్నామన్నారు. స్టాక్ పాయింట్‌కు ఇసుక చేరుకున్న తరువాత ఎగుమతులు చేస్తామన్నారు.



ఇసుక సరఫరాకు ఇబ్బందులు కలిగించొద్దు

కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

నిడదవోలు/కొవ్వూరు,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక ర్యాంపుల నుంచి బయటకు సరఫరా చేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. రాత్రి సమ యాల్లో ర్యాంపుల నుంచి ఇసుక అక్రమ తరలిపోతుందన్న సమాచారంతో సోమవారం అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో నిడదవోలు మండలం పెండ్యాల, జీడిగుంట, పందలపర్రు, కొవ్వూరులో ఎరినమ్మ, దండగుంట,ఔరంగాబాద్ ఇసుక ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ర్యాంపుల్లో అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాంపుల్లో స్థానిక లారీలకు ఇసుక అందించడం లేదని, స్థానికేతరులకు ఇసుక అందిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు.ఇసుక సరఫరాలో ఆటంకాలు కలిగించవద్దన్నారు.ఆమె వెంట తహశీల్దార్లు బి.నాగరాజు నాయక్, ఎం.దుర్గాప్రసాద్, ఎస్‌ఐ కె.జగన్మోహనరావు ఉన్నారు.

వైసీపీకి రాజీవ్ కృష్ణ రాజీనామా

- 3లో

ఆన్‌లైన్‌లో ప్రకటన చూసి రూ.3 లక్షలు చెల్లింపు

-కుట్టుమిషన్ రాక లబోదిబో

- పోలీసులకు ఫిర్యాదు

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో ప్రకటన చూసి మోసపోయిన మహిళ ఉదంతమిది. ఎంబ్రాయిడరీ కుట్టుమిషన్ అమ్ముతానని చెప్పి మహిళను మోసగించిన సంఘటనపై కేసు నమోదు చేశారు. కొవ్వూరు పట్టణానికి చెందిన గుల్లపూడి సుప్రియ పద్మ ఫేస్‌బుక్ అకౌంట్‌లో మహిళల జాకెట్లు కుట్టే ఎంబ్రాయిడరి మిషన్ చూసి ఫోన్ చేసింది. ఫోన్ చేసిన అనంతరం రూ.3 లక్షలు అవుతుందని అవతలి వ్యక్తి చెప్పాడు. అవతలి వ్యక్తి మాటలను నమ్మిన పద్మ 2 దఫాలుగా న్యూఢిల్లీకి చెందిన అకౌంట్ నెంబరుకి 2024 జూన్ 25వ తేదీన రూ.3 లక్షలు జమ చేసింది. సొమ్ము చెల్లించిన అనంతరం ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఇప్పటివరకు వారి ఆచూకీ కోసం గాలించినా దొరకకపోవడంతో సుప్రియ పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగిద్దాం

నల్లజర్ల పీహెచ్‌సీ పరిశీలనలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వసుంధర



బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ వసుంధర

నల్లజర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే వైద్యం బాగా అందుతుందని ప్రజల్లో నమ్మకం కలిగేలా వైద్యాన్ని అందిద్దామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వసుంధర అన్నారు. మంగళవారం నల్లజర్ల ప్రభుత్వాసుపత్రిని ఆమె సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిత్యం ప్రజలతో మమేకమై వారికి అవసరమైన సేవలందించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య సదుపాయలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని వ్యాధులకు చికిత్స అందిస్తున్నామని, ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను వదిలి ప్రభుత్వ ఆసుపత్రులకు రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత రోజుల్లో వైద్యం మరింత ఖరీదు అయ్యిందని, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు పోగొట్టుకోవద్దని అన్నారు. ప్రతి జిల్లా ఆసుపత్రుల్లో అన్ని సేవలు అందిస్తున్నట్టు డాక్టర్ వసుంధర చెప్పారు. అనంతరం బాలింతలకు పౌష్టికాహారం అందించారు.

ట్రాఫికర్

» రోడ్డుకు రెండు వైపులా నిలిచిపోతున్న ఇసుక లారీలు

» కొవ్వూరు-వాడపల్లి రోడ్డులో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం

» ప్రయాణికుల ఇబ్బందులు

» పట్టించుకోని పోలీసులు



కొవ్వూరు-వాడపల్లి రోడ్‌లో నిలిచిన ట్రాఫిక్

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు-వాడపల్లి రహదారిలో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇసుక ర్యాంపులకు వచ్చిన లారీలను రోడ్డుకు ఇరువైపులా నిలుపదల చేయడం, వాటికి తోడు ఆటోలు ఇష్టానుసారం ప్రయాణాలు సాగించడంతో తరచుగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి నిత్యం నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, పెరవలి, నిడదవోలు పరిసర ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు, ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వాడపల్లి, కొవ్వూరు మీదుగా రాజమహేంద్రవరం వెళ్తుంటారు. ఈ రోడ్డులో తరచుగా ట్రాఫిక్ నిలిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబంబదులకు గురవుతున్నారు. ఇసుక కోసం వచ్చే లారీలు కొవ్వూరు, వాడపల్లి ఏటిగట్టు రహదారిలో రోడ్డుకు ఇరువైపులా వరుసగా పార్కింగ్ చేయడంతో మధ్యలో వస్తున్న వాహనం ఏదైనా కొంచెం అటుఇటుగా వచ్చిందంటే ట్రాఫిక్ నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో ఔరంగాబాద్ ఇసుకర్యాంపు నుంచి వాడపల్లి వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇసుకర్యాంపులలోనే కాకుండా, రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోకుండా ప్రత్యేక పోలీసులు బందోబస్తుతో ఏర్పాటు చేయాలని స్థానికులు అంటున్నారు. ఈ రహదారిలో విజ్జేశ్వరం నుంచి కొవ్వూరు వరకు రక్షక్ వాహనాన్ని ఏర్పాటుచేసి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

» విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు » కొవ్వూరు గ్రంథాలయాధికారి త్రినాథ్

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి జీవీవీఎస్ త్రినాథ్ తెలిపారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో 9,10 తరగతులు, జూనియర్ విభాగంలో 6,7,8 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 14న చిత్రలేఖనం పోటీలు, జూనియర్స్‌కు మన రాష్ట్ర చిహ్నాములు, సీనియర్స్‌కు ప్రకృతి అందాలు, 15న గ్రంథాలయాల ఆవశ్యకత, విద్యార్థులు ఎలాంటి పుస్తకాలు చదవాలి అంశాలపై వ్యాసరచన పోటీలు, 16న దేశభక్తి(జానపద, లలిత గీతాలు) గేయాల పోటీలు, 17న వక్తృత్వ పోటీలు, జూనియర్స్‌కు బాధ్యతాయుత పౌరులుగా ఎలా ఎదగాలి, సీనియర్స్‌కు భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి నేటి యువత ఏం చేయాలి. 18న క్విజ్(స్కూల్‌కి ఒక టీం మాత్రమే). 19న విద్యార్థినులకు కాగితంపై రంగవల్లుల పోటీలు జరుగుతాయని త్రినాథ్ పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గంట ముందుగా హాజరుకావాలన్నారు. చిత్రలేఖనం పోటీలకు ఏ3 సైజు డ్రాయింగ్ షీటు, రంగులు, బ్రెష్‌లు విద్యార్థులే తెచ్చుకోవాలన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందిస్తామని చెప్పారు.

19న ప్రభుత్వ మద్యం షాపుల్లో వస్తువుల వేలం

చాగల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌బీసీఎల్ చాగల్లు డిపో పరిధిలోని 117 ప్రభుత్వ మద్యం షాపుల నుంచి తీసుకువచ్చిన వస్తువులకు ఈ నెల 19న వేలం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ ఎం.రామకృష్ణదాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించినప్పుడు ఉపయోగించిన ఫ్రీజర్, ఇన్వర్టర్ బ్యాటరీ, క్యాష్ చెస్ట్, స్కానర్, క్యాష్ కౌంటింగ్ మిషన్‌లను వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి, ప్రభుత్వ గుర్తింపుకార్డు నకలు సమర్పించాలని, పాడుకున్న వస్తువు ధర మొత్తం వెంటనే 18శాతం జీఎస్టీతో చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం 96767 14547 లేదా 99493 51050 నెంబర్లను సంప్రదించాలని కోరారు. వేలం చాగల్లులోని ఏఎంఎఫ్ఎల్ డిపో వద్ద నిర్వహిస్తారని రామకృష్ణదాస్ పేర్కొన్నారు.

ప్రజాసమస్యలపై ప్రజాపోరు : సీపీఎం



ప్రజా పోరు పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చాగల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీపీఎం నాయకుడు ఎం.సుందరంబాబు తెలిపారు. మంగళవారం స్థానిక సెంటర్‌లో కరపత్రాలను పంపిణీ చేశారు. పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నిత్యావరస వస్తువుల ధరల నియంత్రణలో విఫలమైందన్నారు. స్మార్ట్ మీటర్లు ఆపివేయాలని, విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేకే దుర్గారావు, కంకటాల బుద్ధుడు, జీవీ సుబ్బారావు, ఎస్.ఆదాం, కె.కొండయ్య పాల్గొన్నారు.

వెడల్పు పెంచితే ఉపాధి కోల్పోతాం

» 18 మీటర్లు అయితే అభ్యంతరం లేదు

» దొండపూడిలో హైవే విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థులు

» మార్కింగ్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం: ఆర్డీవో రాణి సుస్మిత



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దొండపూడి గ్రామస్థులు

గోపాలపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వరకు నిర్మించ తలపెట్టిన జాతీయ రహదారి 365 బీబీ విస్తరణకు దొండపూడిలో మార్కింగ్‌ను స్వయంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని ఆర్డీవో డాక్టర్ రాణిసుస్మిత అన్నారు. దొండపూడిలో నిర్మించనున్న జాతీయ రహదారిపై గ్రామస్థుల నుంచి అభిప్రాయ సేకరణ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం చేపట్టారు.59మంది తమ అభిప్రాయాన్ని వినతుల రూపంలో ఆర్డీవోకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మొదటి గెజిట్‌లో 18మీటర్ల వెడల్పుతో జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడతామని తెలిపిన అధికారులు, 2వ గెజిట్‌లో 22మీటర్లకు విస్తరిస్తామని తెలిపారన్నారు.22మీటర్లు రోడ్డు నిర్మిస్తే ఎన్నో కుటుంబాలు జీవనోపాధి కోల్పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. 18 మీటర్లు వెడల్పుతో రోడ్డు విస్తరణ చేపడితే గ్రామస్థులకు ఎటువంటి అభ్యంతరం లేదని, దొండపూడికి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ దొండపూడికి బైపాస్ రహదారి నిర్మించడానికి గ్రామ ప్రధాన సెంటర్‌లో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నందున బైపాస్ రోడ్డు నిర్మాణం వీలుపడదని గత అధికారులే తేల్చారన్నారు. అయితే 18మీటర్ల రోడ్డు నిర్మిస్తే ఎన్ని కుటుంబాలకు నష్టం జరుగుతుందో, 22 మీటర్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడితే ఎన్ని కుటుంబాలకు నష్టం కలుగుతుందనేది గతంలో వేసిన మార్కింగ్‌ను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏదేమైనా ప్రజల అభిప్రాయా లను పరిగణలోకి తీసుకుని ఎక్కువ శాతం నష్టం వాటిల్లకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ఆర్డీవో చెప్పారు. అభివృద్ధిలో భాగంగా ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ విద్యాపతి తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారం

గోపాలపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సతీష్‌కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై హుకుంపేట గ్రామానికి చెందిన రాయపాటి సుబ్రహ్మణ్యం అత్యాచారానికి పాల్పడినట్టు నిర్ధారణయ్యిందన్నారు. దీనిపై సోమవారం సాయంత్రం బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దీనిపై దేవరపల్లి సీఐ బి.నాగేశ్వరరావునాయక్ దర్యాప్తు చేస్తున్నారన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఉండ్రాజవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్ధరి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తక్షణ సహాయంగా జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ ద్వారా మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, సర్పంచ్ చీపుళ్ల కుమారి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో ఏకాహం

చాగల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నెలటూరులోని సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఏకాహం నిర్వహించి భజనలు, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక వేపర్ల వారి రామాలయంలోను ఏకాహ భజనలు జరిగాయి. శివాలయంలో విశేష పూజలు జరిపారు. మహిళలు దీపాలు వెలిగించారు.

న్యుమోనియాపై అవగాహన కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్

ఉండ్రాజవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో న్యూమోనియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో న్యూమోనియా వ్యాధిపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మంగళవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 తేదీ వరకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. న్యూమోనియా ప్రమాదకర వ్యాధి అని, ఐదేళ్లలోపు పిల్లలకు వచ్చే లక్షణాలను గుర్తించాలన్నారు. దగ్గు, జలుబు ఎక్కువగా ఉండడం, ఎక్కువసార్లు వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో డొక్కలు ఎగురవేయడం వంటి లక్షణాలు ఉంటాయని డాక్టర్ ప్రసాద్ చెప్పారు. ఈ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్యసేవలు పొందేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీపీ కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు వేగవంతం చేయాలి



పెరవలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పెరవలి మండలంలో టీడీపీ సభ్యత్వాలను వేగంగా చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు సూచించారు. పెరవలి తదితర గ్రామాల నుంచి పలువురు టీడీపీ నాయకులు వేలివెన్నులో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నిడదవోలు నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉండేవిధంగా సభ్యత్వాలు వేగంగా చేయించాలని నాయకులను కోరారు. కార్యక్రమంలో సలాది కృష్ణమూర్తి, సలాది శ్రీహరి, రంగినీడి కట్లయ్య పాల్గొన్నారు .

పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికలపై శిక్షణ తరగతులు

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఈనెల 15వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పణపై ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కొవ్వూరు ఎంపీడీవో కె. సుశీల తెలిపారు. 2025-26కి సంబంధించి కొవ్వూరు మండలంలో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి, మెరుగైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి, ప్రణాళికలను సాధించడం కోసం, సామర్థ్యం పెంపుదలకు మండలస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఈనెల 15వ తేదీ ఉదయం 9-30 నుంచి సాయంత్రం 6గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణకు వచ్చే సిబ్బంది ఆధార్ నంబరు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరుతో హాజరుకావాలన్నారు.

మహిళను గాయపర్చిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళను కొట్టి గాయపర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం.వి.వి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన బొంతా కుమారి సెల్‌ఫోన్ పోయిందని ఈనెల 11న రాత్రి ఇంటి వద్ద తిట్టుకుంటుంది. ఇంతలో బొంతా వెంకటేష్, వెంకటరమణలు వచ్చి ఘర్షణపడి కొట్టి కుమారిని గాయపర్చారు. చికిత్స నిమిత్తం కొవ్వూరు, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు బొంతా కుమారి ఇచ్చిన ఫిర్యాదుపై ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురిపై కేసులు

కొవ్వూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ దాడులలో ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు కొవ్వూరు ఎక్సైజ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారంరాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామంలో దాడులుచేసి కోటాడ గోపిని అరెస్టుచేసి 9 లిక్కర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా చాగల్లు మండలం కలవలపల్లిలో దాడులు నిర్వహించి 7 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకుని కోడి చినరాజు, మట్టా కృష్ణకుమారిలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

గోదావరిని శుభ్రంగా ఉంచండి

» కోటిలింగాల పేట వద్ద ఈట్ స్ట్రీట్‌ను సిద్ధం చేయాలి

» కమిషనర్ కేతన్ గార్గ్



కోటిలింగాలరేవులో ఈట్‌స్ట్రీట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోటిలింగాల పేట వద్ద ఉన్న ఈట్ స్ట్రీట్‌ను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం కోటిలింగాలరేవు, ఆర్యా పురం, కోటగుమ్మం సెంటర్, వీఎల్ పురం తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. కోటిలింగాలరేవు వద్ద ఈట్ స్ట్రీట్‌లో ఉన్న చిన్నచిన్న పనులు పూర్తి చేయాలన్నారు. ఆయా షాపులను వేలం వేయాలని ఆదేశించారు. ఆర్యాపురం నల్లా చానల్ వద్ద ఇరిగేషన్ డిపార్టుమెంట్ భవనం స్థలంలో గోషాల ఏర్పాటు చేయడానికి వచ్చిన ప్రతిపాదనను పరిశీలించారు. అనంతరం పుష్కరాల రేవును పరిశీలించారు. గోదావరి నదిలో తేలుతున్న వ్యర్థా లను ఎప్పటికప్పుడు తొలగించి నదిని పరిశుభ్రంగా ఉంచాలని, కార్తీకమాసం సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోటగుమ్మంసెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలని సూచించారు. వీఎల్ పురం చేరుకుని అక్కడ ఉన్న పార్కును సందర్శించి ప్రహరి గోడ నిర్మించాలని, నడకదారిలో పేవర్ బ్లాకులు ఏర్పాటు చేయాలని, గ్రిల్స్ పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మదర్షాఅలీ, సిటీ ప్లానర్ కోటయ్య, డీఈ ప్రసాద్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు ఉన్నారు.

అల్పపీడనంతో రైతుల్లో ఆందోళన



గౌరీపట్నం జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం

దేవరపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో వాతావరణ మార్పులు వచ్చి మబ్బులుగా ఉండటంతో ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం రోడ్లపై ఆరబెట్టడం, కుప్పలుగా పెట్టడం జరిగింది. కొంతమంది రైతులు వాతావరణ మార్పులవలన బస్తాల్లో లోడుచేసి సురక్షితంగా ఇళ్లకు తరలిస్తున్నారు. పొలాల్లో పోసిన ధాన్యాన్ని జాతీయరహదారి పొడుగునా గౌరీపట్నం, దుద్దుకూరు. యర్నగూడెం గ్రామాల్లో ధాన్యాన్ని ఆరబెట్టి ఉంచారు. వర్షంపడితే ధాన్యం రంగు మారి కొనే పరిస్థితులు ఉండవని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతులు బరకాలు కప్పుతున్నారు.

శిక్షణకు నల్లజర్ల చేరుకున్న ఎన్‌సీసీ కేడెట్లు



ఏకేఆర్‌జీ కళాశాలకు చేరుకున్న వివిధ జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్‌లు

నల్లజర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌లకు నల్లజర్ల ఏకేఆర్‌జీ ప్రాంగణంలో బుధవారం నుంచి ఈనెల 21వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు 19 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే పేర్కొన్నారు. మూడు జిల్లా నుంచి 12 కళాశాలు, 23 పాఠశాలలకు చెందిన 664మంది విద్యార్థులు మంగళవారం నల్లజర్ల ఏకేఆర్‌జీ కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేయించుకున్నారు. 2026 ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు మూడు జిల్లా నుంచి క్యాడెట్ల ప్రాబబుల్స్‌ను ఎంపిక చేయడంతోపాటు, వివిధ రకాల శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది జరుగునున్న రిపబ్లిక్ పరేడ్‌కు ఉమ్మడిజిల్లా నుంచి ఆరుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపికయ్యారని, వీరికి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



దేవరపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పల్లంట్ల గ్రామంలో శ్రీరాజ రాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం ఆలయంవద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ వ్రతాల్లో బలుసు సత్యనారా యణ దంపతులు, ఆలయకమిటీ సభ్యులు కొయ్యలమూడి సురేంద్ర, ఈద్పూ గంటి శివరామ్, యలమాటి చినరామారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొవ్వూరు తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ అన్నారు. కొవ్వూరు మండలం వేములూరు లో మంగళవారం రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కార వేదిక గ్రామసభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామసభలలో రైతులు నుంచి భూ సమస్యలపై స్వీకరించి, పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు

జనసేన నాయకుల ఆర్థిక సాయం

దేవరపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లికి చెందిన దాసుపల్లి ఏడుకొండలు దీపావళి రోజున దీపావళి సామగ్రి వెలిగిస్తుండగా కన్నుకు గాయంకావడంతో జనసేనపార్టీ తరపున రూ.20వేలు వైద్య ఖర్చుల నిమిత్తం మంగళవారం గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు అందజేశారు.నాయకులు అనిశెట్టి గంగరాజు, చప్పటి శివనాగ ప్రసాద్, పసుపులేటి ప్రసాద్, కంబాలసత్తిబాబు, జాజిమొగ్గల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సూరిశెట్టి బాలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేసిన జనసేన నాయకులు

టీడీపీ సభ్యత్వాలు వేగవంతం చేయాలి



సభ్యత్వాల నమోదును చూపిస్తున్న టీడీపీ నాయకులు

దేవరపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్ పిలుపునిచ్చారు. దేవరపల్లిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో 80వేలు సభ్యత్వ నమోదు టార్గెట్ కాగా దేవరపల్లి మండలంలో 20వేలు సభ్యత్వ నమోదు చేయడానికి కృషి చేస్తామన్నారు. మండలంలో ఇప్పటికి 5వేల సభ్యత్వాలు నమోదు చేశామని పది రోజుల్లో 1500 సభ్యత్వాల నమోదుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ నెల 14న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తామని మండల నాయకులు, కార్యకర్త లు తరలిరావాలని కోరారు. టీడీపీ నాయకులు ఉప్పులూరి రాంబాబు, కాట్రు భీమరాజు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, నాని, కవల సురేష్, అంజిబాబు, దొరయ్య, సందీప్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నల్లజర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన భవననిర్మాణ కార్మికుడు కొవ్వూరి దుర్గాప్రసాద్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వైద్యఖర్చుల నిమిత్తం నల్లజర్ల మండల ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి(వీపీపీఎస్) మంగళవారం ఆసుపత్రికి వెళ్లి దుర్గాప్రసాద్‌ను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా నల్లజర్లకు చెందిన గుడె గోపాలకృష్ణ, బొందల శ్రీనివాస్ కలిసి మరో రూ.5వేలు అందించారు. వీపీపీయస్ మండలాధ్యక్షుడు వీరమల్ల అనిల్‌కుమార్, గౌరవాధ్యక్షుడు పిల్లి కాంతారావు,కోశాధికారి గుడె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



దుర్గాప్రసాద్ భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు